నేటి దినపత్రిక

# సూర్య

ఉత్తరాంధ్ర

సోమవారం
16-9-2024
పేజీలు 5

www.suryaa.com

విశాఖ - అనకాపల్లి - అల్లూరి - మన్యం
విజయనగరం
శ్రీకాకుళం




## అర్ధనారీశ్వర గణపతిగా శ్రీ సంపత్ వినాయగర్ స్వామి దర్శనం



### పోటెత్తిన భక్త జనం

విశాఖపట్నం, సెప్టెంబర్ 15, మేజర్‌న్యూస్ :

శ్రీ ఆర్ధనారీశ్వర గణపతిగా శ్రీ సంపత్ వినాయగర్ స్వామి అదివారం భక్తులకు దర్శనమిచ్చారు. నగరం నుంచి కాకుండా వివిధ ప్రాంతాల నుంచి కూడా భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. గణపతి హెూమం, నాదస్వర కచేరి, ఉభయ దాతలచే ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. మధ్యాహ్నం ఆలయ ఆవరణలో నారాయణ సేవ 1500 మందికి మిగతా 2లో

# నడి సంద్రంలో ఫిషింగ్ బోటు దగ్ధం



### విశాఖ తీరంలో బయల్దేరిన కొద్ది గంటల్లోనే మంటలు
### - సురక్షితంగా ఒడ్డుకు చేరిన ఐదుగురు మత్స్యకారులు
### -పరిహారం అందిస్తామని హామీ ఇచ్చిన ఎంపీ శ్రీ భరత్

విశాఖపట్నం, సెప్టెంబర్ 15, మేజర్‌న్యూస్

విశాఖపట్నం తీరం నడి సముద్రంలో ఫిషింగ్ బోటు అగ్నికి ఆహుతైంది. దగ్ధమవుతున్న ఈ బోటు నుంచి అయిదుగురు మత్స్యకారులు సురక్షితంగా బయట పడ్డారు. దీంతో ఆయా మత్స్యకారుల కుటుంబ సభ్యులు, ప్రభుత్వ యంత్రాంగం కూడా ఊపిరి పీల్చుకుంది. తీవ్ర ఉత్కంఠ రేపిన ఈ బోటు ఐదుగురు మత్స్యకారులతో ఆదివారం ఉదయం ఐ.ఎన్.డి.ఏపీ వి 5 ఎంఎం 495 నెంబర్ గల వాసుపల్లి అప్పయ్యమ్మకు చెందిన మేకనైజ్డ్ బోటు చేపల వేటకు వెళ్ళింది. మధ్యాహ్నం 12 గంటల సమయంలో బోటు ఇంజిన్లో ప్రమాదవశాత్తు అగ్ని కీలు చెలరేగడంతో బోటు పూర్తిగా దహనమైంది. ప్రాణభయంతో మత్స్యకారులు బోటు నుండి సముద్రంలో దూకేసి తమకు సమీపంలో ఉన్న ఏరుపల్లి ధనరాజుకు చెందిన ఐఎన్డీ ఏపీ వి 5ఎంఎం 894 బోటు ఎక్కి ఆదివారం సాయంత్రం సురక్షితంగా విశాఖ హార్బర్‌కు చేరుకొన్నారు. ఒడ్డుకు చేరుకొన్న మత్స్యకారుల్లో వి.గురుమూర్తి, ఆర్. నర్సింహులు, గణగల్ల రాము, ఉమ్మడి సత్తయ్య, సురపతి అప్పన్న ఉన్నారు, ఈ ఘటన తెలియగానే మత్స్య శాఖ ఇంచార్జి జాయింట్ డైరెక్టర్ జి.విజయ ఫిషింగ్ హార్బర్‌కు చేరుకొని మత్స్యకారుల యోగ క్షేమాలు అడిగి తెలుసుకొన్నారు. జరిగిన ప్రమాదంపై నివేదికను ప్రభుత్వంకు పంపుతామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర మెకనైజ్డ్ ఫిషింగ్ బోటు ఆపరేటర్స్ అసోసియేషన్ అధ్యక్షులు మైలపల్లి లక్ష్మణరావు మాట్లాడుతూ సముద్రంలో బోటు కాలిపోవడం దురదృష్ట కరమని మత్స్యకారులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ఒడ్డుకు చేరుకున్నారని చెప్పారు. బోటు పూర్తిగా కాలి పోయి సముద్రంలో మునిగిపోయిందని రాష్ట్ర ప్రభుత్వం ఇందుకు తగు పరిహారం చెల్లించాలని కోరారు. బోటు ఇంజన్లో మంటలు చెలరేగడంతో ఈ ఘటన జరిగిందని ఈ ఏడాది జూన్ 15న మిగతా 2లో

## 11మంది ఎస్‌ఐలకు బదిలీలు

విశాఖపట్నం, సెప్టెంబర్ 15, మేజర్‌న్యూస్




విశాఖ సిటీ పరిధిలోని 11మంది సబ్ ఇన్‌స్పెక్టర్లకు బదిలీలయ్యాయి. ఈ మేరకు పోలీస్ కమిషనర్ డాక్టర్ శంకబ్రత బగ్చీ ఉత్తర్వులు జారీ చేశారు. తమకు ఫలానా చోటకు బదిలీ చేయాలని ఎస్‌ఐలు కోరుకోవడం, మరికొందర్ని అడ్మినిస్ట్రేటివ్ గ్రౌండ్స్ కింద స్థానచలనం కలిగించినట్టు అధికారులు చెబుతున్నారు. ఇటీవల కొందరు సీఐల్ని బదిలీ చేసిన అధికారులు ఇప్పుడు ఎస్‌ఐల జాబితాల్ని తయారు చేస్తున్నారు. బదిలీ అయిన అధికారుల వివరాలిలా ఉన్నాయి. పీఎంపాలెంలో పని చేస్తున్న కే సురేష్‌కుమార్‌ను త్రీటౌన్‌కు వేశారు. ఎయిర్‌పోర్ట్ పీఎస్‌లో పని చేస్తున్న డి.వరలక్ష్మిని స్టీల్‌ప్లాంట్ ట్రాఫిక్ ఎస్‌ఐగా వేశారు. పద్మనాభంలో పని చేస్తున్న కొమ్మర శ్రీనివాసరావు (ర్యాంకర్ ఎస్‌ఐ)ను వన్‌టౌన్ ట్రాఫిక్ ఎస్‌ఐగా వేశారు. దువ్వాడలో పని చేస్తున్న సీహెచ్ సూర్యనారాయణను పద్మనాభం/సైబర్ క్రైం ఎటాచ్‌గా వేశారు. గాజువాకలో పని చేస్తున్న కె.భాస్కరరావును పీఎంపాలెం వేశారు. మహిళా పోలీస్ స్టేషన్‌లో పని చేస్తున్న ఎస్.గౌరీని భీమిలి పంపించారు. వన్‌టౌన్‌లో పని చేస్తున్న సీహెచ్ స్వామి నాయుడ్ని పెందుర్తి వేశారు. దువ్వాడ ట్రాఫిక్‌లో పని చేస్తున్న ఎస్.కృష్ణవర్మను ఎంవీపీ స్టేషన్‌కు ఎటాచ్ చేశారు. రేంజి నుంచి వచ్చిన ఎస్. సురేష్‌ను ఎయిర్‌పోర్టుకు వేశారు. సైబర్ క్రైంలో పని చేస్తున్న ఎం.రాధాకృష్ణను గాజువాక పంపించారు.

## ప్రజా దర్బార్లో వినతులు స్వీకరిస్తున్న మంత్రి గుమ్మడి సంధ్యారాణి



పాచిపెంట, సెప్టెంబర్ 15, మేజర్‌న్యూస్

సాలూరు పట్నంలో స్త్రీ శిశు సంక్షేమ శాఖ మరియు గిరిజన సంక్షేమ శాఖ మంత్రి క్యాంపు కార్యాలయం వద్ద ఆదివారం ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ ప్రజా దర్బార్ కార్యక్రమంలో స్వయంగా స్త్రీ శిశు సంక్షేమ శాఖ మరియు గిరిజన సంక్షేమ శాఖ మంత్రివర్యులు గుమ్మడి సంధ్యారాణి పాల్గొని పలు సమస్యలపై వచ్చిన ఫిర్యాదులను స్వీకరించి వెంటనే వాటిని పరిష్కరించే దిశగా సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కార మార్గం చేపట్టారు. ఈ ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో తమ ఫిర్యాదులను సమర్పించేందుకు పెద్దఎత్తున ప్రజలు హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి గుమ్మడి సంధ్యారాణి మాట్లాడుతూ ప్రతి ఫిర్యాదును క్షుణ్ణంగా పరిశీలించి, వీలైనంత త్వరగా పరిష్కారం చేస్తామని మంత్రి తెలిపారు. ప్రజలు ఎంతో ఆశతో, విశ్వాసంతో ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వస్తున్నారని ఆమె అన్నారు. సుదూర ప్రాంతాల నుంచి ప్రజలు వస్తున్నారని, ఫిర్యాదును పరిష్కరిస్తే, వారు సంతోషంగా ఉంటారని, ఫిర్యాదు సమర్పించేందుకు వారు పడిన బాధలన్నీ మరచిపోతారని ఆమె అన్నారు. ప్రజలకు మెరుగైన సేవలందించేందుకు ఎప్పుడు అందుబాటులో వుంటానని తెలిపారు. పాచిపెంట మండలం కేసలి పంచాయితీ కుంబాడవలస గ్రామానికి చెందిన గ్రామస్తులు ఎన్నికల సమయంలో ఇచ్చిన మాట ప్రకారం రోడ్డు మంజూరు చేసినందుకు మంత్రిగారికి కృతజ్ఞతలు తెలిపారు. పాచిపెంట మండలం గడివలస గ్రామానికి చెందిన బెవర త్రినాథ గత ప్రభుత్వం పెన్షన్ రద్దు చేసిందని పెన్షన్ ను పునరుద్ధరించాలని కోరగా వెంటనే మంత్రి మిగతా 2లో

## బ్లాక్ స్పాట్స్ వద్ద ప్రమాదాలకు కారణాలను అన్వేషించండి

### విజయనగరం జిల్లా ఎస్పీ వకుల్ జిందల్



విజయనగరం క్రైమ్ సెప్టెంబర్ 15, మేజర్ న్యూస్

విజయనగరం జిల్లాలో వివిధ ప్రాంతాల్లో తరుచూ రహదారి ప్రమాదాలు జరుగుతున్న బ్లాక్ స్పాట్స్ వద్ద ప్రమాదాలు జరుగుటకు కారణాలను అన్వేషించి, ప్రమాదాల నియంత్రణకు కార్యాచరణ రూపొందించాలని సంబంధిత పోలీసు అధికారులను జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ సెప్టెంబరు 15న ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ మాట్లాడుతూ జిల్లాలో తరుచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతూ, ప్రమాదాల్లో మరణాలు సంభవించిన ప్రాంతాలను బ్లాక్ స్పాట్స్ గా పోలీసుశాఖ గుర్తించందన్నారు. ఈ గుర్తించిన బ్లాక్ స్పాట్స్ ను సంబంధిత డీఎస్పీలు, సిఐలు, ఎస్సైలు, నేషనల్ హైవే అథారిటీ అధికారులు, మున్సిపల్, రోడ్లు భవనాలు శాఖ, రవాణశాఖ అధికారులు సంయుక్తంగా సందర్శించాలని, ఆయా ప్రాంతాల్లో తరుచూ రహదారి ప్రమాదాలు జరుగుటకు గల కారణాలను అన్వేషించాలని అధికారులను ఆదేశించారు. ఇటీవల జిల్లా కలెక్టరు ఆధ్వర్యంలో నిర్వహించిన రోడ్డు సేఫ్టీ మీటింగులో బ్లాక్ స్పాట్స్ పై వివిధ శాఖల అధికారులతో చర్చించారు. ఈ బ్లాక్ స్పాట్స్ వద్ద ప్రమాదాలు జరుగుటకు కారణాలు అన్వేషించేందుకు సంబంధిత అధికారులు సంయుక్తంగా సందర్శించి, పరిశీలన చేసి, ప్రమాదాల నియంత్రణకు నివేదిక రూపొందించాలన్నారు. బ్లాక్ స్పాట్స్ వద్ద ప్రమాదాలకు గల ప్రధాన కారణాలను గుర్తించి, చేపట్టాల్సిన చర్యలపై అధికారులు తగిన సూచనలు చేయనున్నారు. బ్లాక్ స్పాట్స్ వద్ద ప్రమాదాల నియంత్రణకు ఇంజనీరింగ్ మార్పులు ఏమైనా చేపట్టాలా? లైటింగ్ కల్పించాలా? వాహనాల వేగాన్ని నియంత్రించేందుకు స్పీడ్ బ్రేకర్స్ వేయాలా? స్టాపర్స్ ఏర్పాటు చెయ్యాలా? ఎదురుగా వచ్చే వాహనాలు కనపడే విధంగా మొక్కలను తొలగించాలా లేక ఇంకేమైనా మార్పులు చేపట్టాలా, చర్యలు చేపట్టాలా అన్న విషయాలను గుర్తించి, నివేదిక రూపొందించాల్సి ఉంటుందని జిల్లా ఎస్పీ అన్నారు. అన్ని శాఖల అధికారులు సంయుక్తంగా బ్లాక్ స్పాట్స్ సందర్శించి, త్వరితగతిన నివేదికలు రూపొందించాలని అధికారులను జిల్లా ఎస్పీ ఆదేశించారు. జిల్లా ఎస్పీ ఆదేశాలతో అధికారులు జిల్లా వ్యాప్తంగా బ్లాక్ స్పాట్స్ తనిఖీలు చేపట్టి, ప్రమాదాలు జరుగుటకు కారణాలను గుర్తించే చర్యలు చేపట్టారు. ఇప్పటికే పలువురు పోలీసు అధికారులు, ఇతర శాఖల మిగతా 2లో

## ఈపీడీసీఎల్‌లో 'మోక్షగుండం' జయంతి



విశాఖపట్నం, సెప్టెంబర్15, మేజర్ న్యూస్

భారతరత్న, సర్, మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని పురస్కరించుకుని ఆదివారం ఈపీడీసీఎల్ ఘనంగా నివాళులర్పించింది. ఇంజనీర్స్ డే సందర్భంగా కార్పొరేట్ కార్యాలయ ఆవరణలో మోక్షగుండం చిత్రపటానికి సంస్థ చీఫ్ జనరల్ మేనేజర్లు వి.విజయలలిత, బి.రామచంద్రప్రసాద్, డి.సుమన్ కల్యాణి, టీవీఎస్ఎన్ మూర్తి, బి.అశోక్ కుమార్, కార్పొరేట్ కార్యాలయ సిబ్బంది పూలమాలలు వేసి నివాళులర్పించారు. విశ్వేశ్వరయ్య ఇంజినీరింగ్ రంగంలో చేసిన సేవల్ని ఈ సందర్భంగా కొనియాడారు. ఏపీఎస్ఈబీ ఇంజినీరింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈపీడీసీఎల్‌లో ప్రతిభ కనబరస్తున్న సీజీఎంలు వి.విజయలలిత, బి.రామచంద్రప్రసాద్‌కు సీజీఎంలు డి.సుమన్ కల్యాణి, టీవీఎస్ఎన్ మూర్తి చేతుల మీదుగా ఎమినెంట్ ఇంజినీర్ పేరిట పురస్కారాలు అందజేశారు.

# ఇటుకుల బట్టీలలో ప్రమాదాలు పట్టవా?

### అనుమతుల్లేకుండా నిర్వహణ -అనుమానాస్పద స్థితిలో యువకుని గల్లంతు
### -ప్రమాదవశాత్తూ కాలువలో పడి పోయాడని అంటున్న నిర్వాహకులు!

అనకాపల్లి, సెప్టెంబర్ 15, మేజర్ న్యూస్:



మునగపాక మండలం అరబుపాలెం గ్రామంలోని ఇటుకల బట్టీలోని పనిచేస్తున్న యువకుడు అనుమానాస్పద స్థితిలో శనివారం గల్లంతు అయ్యాడని తెలుస్తోంది. ఇటుకుల బట్టీలో డ్రైవర్ గా పని చేస్తున్న గుర్రాల బుజ్జి (24) శనివారం సాయంత్రం బట్టీని ఆనుకుని ఉన్న గెడ్డలో దిగి గల్లంతు అయ్యాడని బట్టీ యజమాని నవీన్ చెబుతున్నారు. అక్రమ విద్యుత్ కనెక్షన్ కోసం ఈ గట్టు నుంచి ఆవలి గట్టుకు వెళ్లే క్రమంలో కాలువలోకి దిగి నీట మునిగి చనిపోయినట్లు బట్టీలో కార్మికులు చెబుతున్నారు. మృతి చెందిన బుజ్జి కి ఈత వచ్చునని, పది అడుగుల లోతు ఉన్న గెడ్డలో పడి మృతి చెందడం నమ్మశక్యంగా లేదని కొందరు అంటున్నారు. ఏదేమైనప్పటికీ ఆదివారం సాయంత్రం వరకూ గెడ్డలో గాలింపు జరిగినప్పటికీ మృతదేహం లభ్యం కాలేదు. ఈ మృతి పట్ల పలువురు సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ కనెక్షన్ అక్రమమైనా, సక్రమమైనా డ్రైవర్ ఎందుకు జోక్యం చేసుకున్నాడు? నిజంగా గెడ్డలో మిగతా 2లో

వరద బాధితుల కోసం ముఖ్యమంత్రి సహాయనిధికి

## లారస్ ల్యాబ్స్ ఒక కోటి విరాళం



పరవాడ, సెప్టెంబర్ 15, మేజర్‌న్యూస్

వరద సహాయక చర్యలకు మద్దతుగా ముఖ్యమంత్రి సహాయనిధికి లారస్ ల్యాబ్స్ ఒక కోటి రూపాయల గణనీయమైన విరాళాన్ని అందించింది. సీఈఓ డాక్టర్ సత్యనారాయణ చావా తన సతీమణి నాగ రాణి చావా, ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ నరసింహారావు చావాతో కలిసి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు స్వయంగా విరాళం చెక్కును అందించారు. జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో లారస్ ల్యాబ్స్, ఇతరులు చూపిన దాతృత్వం మరియు నిబద్ధతకు ముఖ్యమంత్రి తన ప్రగాఢ కృతజ్ఞతలు తెలిపారు, ఇది వరదల వల్ల నష్టపోయిన వారి కోసం కొనసాగుతున్న సహాయక చర్యలకు గొప్పగా సహాయపడుతుందనీ అన్నారు.

## అక్రమంగా నిల్వ ఉంచిన పిడిఎస్ బియ్యం స్వాధీనం

### 6500 కేజీల పిడిఎస్ బియ్యం పట్టివేత -విజిలెన్స్ ఎస్‌పి బర్ల ప్రసాద్ ఆదేశాల మేరకు తనిఖీలు

గరుగుబిల్లి, సెప్టెంబర్15, మేజర్ న్యూస్



విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ ఎస్ పి బర్ల ప్రసాద్ ఆదేశాలు మేరకు మండల పరిధిలోని ఉల్లిభద్ర గ్రామ సమీపంలోని ఇర్ఫాన్ కోళ్ల ఫారంలో ఆదివారం తనిఖీ నిర్వహించి, అక్రమంగా నిల్వ ఉంచిన 6500 కేజీల పిడిఎస్ బియ్యంను స్వాధీనం చేసుకున్నారు. రెవిన్యూ, విజిలెన్స్ అధికారులు సంయుక్తంగా దాడులు నిర్వహించి అక్రమంగా నిలవ ఉంచిన బియ్యంను పట్టుకున్నారు. ఈమేరకు కోళ్లఫారం సీజ్ చేసి, కోళ్లఫారం యజమాని ఇర్ఫాన్, బిడ్డిక సూరన్న పై సెక్షన్ (6ఎ)ఈ సి యాక్ట్, క్రిమినల్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సబ్ ఇన్‌స్పెక్టర్ రామారావు, పౌర సరఫరాల ఉపతహశీల్దార్ రామారావు పేర్కొన్నారు. ఈ దాడుల్లో పోలీస్ కానిస్టేబుల్‌లు లక్ష్మీనారాయణ, ఈశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

### పాడైపోయిన తలకాయలు

## బోటీలు అమ్మకాలపై అధికారులు కొరడా



ఆరిలోవ, సెప్టెంబర్ 15, మేజర్‌న్యూస్

జీవీఎంసీ 9వ వార్డు హనుమంతు వాక సమీపంలో పాత మేకల కమెలా వద్ద పాడైపోయిన తలకాయలు, బోటిల్లు, ఢిల్లీ నుంచి వచ్చిన తలకాయలు అమ్ముతున్నారు. ఈ మాసం తినడం వల్ల ప్రజలకు ఆరోగ్యం పాడవుతుంది జీవీఎంసీ అధికారులకు ఫిర్యాదు అందడంతో అధికారులు కమేల వద్దకు వెళ్లి పరిశీలించారు. జనసేన నాయకులు బమ్మిడి ఎల్లాజీ యాదవ్ చేరుకొని తూర్పు నియోజకవర్గం ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు సమస్య తెలియ జేశారు. జనసేన నాయకుడు బమ్మిడి ఎల్లాజీ యాదవ్ కూడ అక్కడ అమ్మిన వాళ్లతో మాట్లాడుతూ మీరు నిలువుంచడంవల్ల అది పాడైపోతూన్న తలకాయలు బోటీలు అమ్ముతున్నారు. అది ప్రజలకి చాలా హానికరము చాలా తప్పు ఇకమీదట ఇలా జరిగితే క్షమించేది లేదు అధికారులతో మాట్లాడి ఇక్కడి నుంచి తీయించడం జరుగుతుందని అన్నారు. పాడైపోయిన తలకాయలు బోటీలు జీవీఎంసీ అధికారులు తీసుకెళ్ళిపోవడం జరిగింది. తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణ బాబు చెడ్డ పేరు వచ్చే పనులు మీరు ఏ ఒక్కరు చేసినా ఉపేశించేది లేదు అని చెప్పడం జరిగింది. తగిన మిగతా 2లో

## విశాఖ స్టీల్ ప్లాంట్‌పై మీ వైఖరి ఏంటో..!

### ఎన్డీఏ కూటమికి మండలి విపక్షనేత బొత్స సూటి ప్రశ్న



విశాఖపట్నం, సెప్టెంబర్ 15, మేజర్‌న్యూస్

ఎట్టి పరిస్థితుల్లోనూ విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటీకరించొద్దు.. ప్లాంట్‌ను కాపాడుకునేందుకు ఎందాకైనా పోరాడతాం..ప్లాంట్‌పై వైయస్సార్‌సీపీది తొలి నుంచీ ఒకే విధానం... నాడు అభ్యంతరం చెప్పడం వల్లనే ప్రైవేటీకరణ ఆగిందని ఏపీ మండలి విపక్షనేత బొత్స సత్యనారాయణ స్పష్టం చేశారు. ఈ మేరకు ఆదివారం విశాఖపట్నం క్యాంప్ ఆఫీస్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ విశాఖ స్టీల్‌ప్లాంట్ ఈ ప్రాంతానికే పరిమితం కాదని, ఇది మొత్తం రాష్ట్ర ప్రజల సెంటిమెంట్ వ్యవహారమన్నారు. ఎన్నో ఉద్యమాలు, 32 మంది బలిదానంతో స్టీల్ ప్లాంట్ ఏర్పాటు అయ్యిందని, అలాంటి ప్లాంట్‌ను అమ్మేసే చర్యలు మిగతా 2లో

## అర్ధనారీశ్వర గణపతిగా శ్రీ సంపత్ వినాయగర్ స్వామి దర్శనం

(మొదటి పేజీ తరువాయి)

చేపట్టారు. సాయంత్రం 6.30 నిం"కు వేదసభకు ముఖ్య అతిధిగా సీఎంఆర్ అధినేత మావూరి వెంకటరమణ విచ్చేశారు. అనంతరం ఘనంగా వేద సభ జరిగింది. తదుపరి అర్ధనారీశ్వర గణపతి అవతారంలో విశేష అలంకరణ స్వామి వారికి నిర్వహించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ ఈవో కె శిరీష, ఫ్యామిలీ ఫౌండర్ నెంబర్ టి ఆర్ చోలాన్, దేవాలయ సిబ్బంది జి గోవిందరెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

## నడి సంద్రంలో ఫిషింగ్ బోటు దగ్ధం

(మొదటి పేజీ తరువాయి)

వేట ప్రారంభమయ్యాక ఇంతవరకు ఆరు బోట్లు ప్రమాదాలకు గురయ్యాయని వాటిలో రెండు అగ్నికి దగ్ధం అయ్యాయని చెప్పారు.రైతుల మాదిరిగానే మత్స్యకారులకు ఎప్పటికప్పుడు పరిహారం చెల్లించాలని అప్పుడే మత్స్య పరిశ్రమ కోలుకుంటుందని పేర్కొన్నారు.ఆదివారం నాటి బోటు కాలిపోయిన దుర్ఘటనను విశాఖపట్నం లోక్ సభ సభ్యులు ఎం. శ్రీ భరత్ కు తెలియజేశామని ఆయన వెంటనే స్పందించి ఈ విషయం ప్రభుత్వంతో మాట్లాడుతానని హామీ ఇచ్చినట్లు మైలపల్లి లక్ష్మణరావు చెప్పారు. సురక్షితంగా ఒడ్డుకు చేరుకున్న మత్స్యకారులతో పాటు రాష్ట్ర ఫిషరీస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ కోలా గురువులు, రాష్ట్ర మర పడవల సంఘం గౌరవ అధ్యక్షులు పి. సి. అప్పారావు అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సురపతి నర్సింగరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ గనగళ్ల రాజేష్, ఉపాధ్యక్షులు మట్టా రాజు,సెక్రెటరీ మున్నం బాలాజీ, జాయింట్ క్యాషియర్ బడే అనీల్,డిప్యూటీ ట్రాఫిక్ మేనేజర్ బి.కె.పట్నాయక్ డాక్ ఇన్స్పెక్టర్ లీలాప్రసాద్ మరియు చీకటి రమేష్, గరికిన రవి,మెరైన్ సీఐ పల్లా అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా దర్బార్లో వినతులు స్వీకరిస్తున్న మంత్రి గుమ్మడి సంధ్యారాణి

(మొదటి పేజీ తరువాయి)

ఎంపిడిఓకి ఫోన్ చేసి సమస్యను పరిష్కరించాలని తెలిపారు. సాలూరు మీ సేవ కేంద్రంలో 2003 నుండి 2020 వరకు ఉద్యోగులుగా సేవలందించామని ఆ తర్వాత గత ప్రభుత్వం నిలుపుదల చేసిందని మరలా మమ్మల్ని ఔట్ సోర్సింగ్ ఉద్యోగులుగా పరిగణించాలని మంత్రి గుమ్మడి సంధ్యారాణికి వినతి పత్రం అందించారు.

## బ్లాక్ స్పాట్స్ వద్ద ప్రమాదాలకు కారణాలను అన్వేషించండి

(మొదటి పేజీ తరువాయి)

అధికారులతో బ్లాక్ స్పాట్స్ సందర్శించి, ప్రమాదాలు జరుగుటకు కారాణాలను అన్వేషిస్తూ, నివేదికలు రూపొందించి, ప్రమాదాల నియంత్రణకు తీసుకోవాల్సి న చర్యలను, సూచనలను చేయనున్నారు. అంతే కాకుండా, బ్లాక్ స్పాట్స్ వద్ద ప్రమాదాలు జరగకుండా రహదారికి రెండు వైపులా కాషనరీ బోర్డులను పోలీసు అధికారులు ఏర్పాటు చేసి, వాహన డ్రైవర్లు ఆయా ప్రాంతాల్లో మరింత అప్రమత్తంగా వ్యవహరించే విధంగా చర్యలు చేపట్టారని జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ తెలిపారు. ఈ తనిఖీల్లో సంబంధిత డీఎస్పీలు ఆర్.గోవింద రావు, పి.శ్రీనివాసరావు, సిఐలు, ట్రాఫిక్ పోలీసులు, ఎస్సైలు, రవాణ, ఎన్.హెచ్.ఎ., ఆర్ అండ్ బి, మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఇటుకుల బట్టీలలో ప్రమాదాలు పట్టవా?

(మొదటి పేజీ తరువాయి)

దిగి మృతి చెందాడా ? లేక మృతదేహాన్ని మాయం చేసారా ? అన్న విషయం పోలీసుల దర్యాప్తులో తేలాల్సి వుంది. కాగా గతంలో కూడా ఇదే బట్టీ లో 30 ఏళ్ల యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. మృతి చెందిన యువకుని పేరిట బట్టీకి చెందిన పలు వాహనాలు రిజిస్ట్రేషన్ చేసి ఉన్నాయి. గుండెపోటుతో మృతి చెందారని, మృతునికి బంధువులు కూడా ఎవరూ లేరని శవ పంచనామాలో పోలీసులు సమాచారం పొందుపరిచారు. ఈ విషయాన్ని కూడా పోలీసులు దర్యాప్తు చేయాలని పలువురు కోరుతున్నారు. మృతదేహం లభ్యమైన వరకూ అసలు కారణం తెలీదని, కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ప్రసాదరావు తెలిపారు.

### అనుమతులు లేకుండానే బట్టీలు నిర్వహణ

జిల్లాలో వందల కొద్దీ ఇటుకల బట్టిలు అనుమతులు లేకుండానే నిర్వహిస్తున్నారని సమాచారం. అక్రమ బట్టీలలో అక్రమంగా విద్యుత్ వినియోగం, అర్హత లేని వాహనాలతో పనులు, కనీసం లైసెన్సు, పరిమిట్లు లేని కాలం చెల్లిన వాహనాలు, జీ ఎస్ టి చెల్లింపులు చేయకపోవడం వంటి పలు నిభంధనలు ఆతిక్రమించినా అధికారులు మాత్రం ఆ వైపు కన్నెత్తి చూడడం లేదు. సదరు పంచాయతీ అధికారులు సైతం మామ్ముళ్ళ మత్తులో పడి ఎన్ని బట్టీలు నిర్వహిస్తున్నారు అనేది లెక్క చెప్పలేని స్థితిలో ఉన్నారు. మండల, జిల్లా అధికారుల సైతం వివరాలు తెలియక పోవడం శోచనీయమని అధికార పార్టీ నాయకులు హేళన చేస్తున్నారు.

## పాడైపోయిన తలకాయలు

(మొదటి పేజీ తరువాయి)

చర్యలు కూడా తీసుకోవడం జరుగుతుందిఅని జీవీఎంసీ అధికారులు జనసేన నాయకులు హెచ్చరించడం జరిగింది ఇకమీదట ఇలా జరిగితే జరిమానా లక్ష రూపాయలు కేసు బుక్ చేయడం జరుగుతుందని అధికారులు హెచ్చరించారు. జీవీఎంసీ శాలరీ ఇన్స్పెక్టర్ చిన్నాజీ జీవీఎంసీ వెటర్నరీ ఇన్స్పెక్టర్ రాము, వాసు సూపర్వైజర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## విశాఖ స్టీల్ ప్లాంట్‌పై మీ వైఖరి ఏంటో..!

(మొదటి పేజీ తరువాయి)

అతి దారుణమన్నారు. స్టీల్ ప్లాంట్‌పై సీఎం, డిప్యూటీ సీఎం నోరెత్తడం లేదని, ఇక్కడి ఎంపీ, ఎమ్మెల్యే చెరోమాట మాట్లాడుతున్నారని...ఇకనైనా రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు తమ వైఖరి చెప్పాలని బొత్స సత్యనారాయణ డిమాండ్ చేశారు. తెన్నేటి విశ్వనాథం వంటి నాయకులు స్టీల్ ప్లాంట్ కోసం ఎంతో కృషి చేశారన్న ఆయన, ఆ ప్లాంట్ కోసం రైతులు 32 వేల ఎకరాలు ఇచ్చారని గుర్తు చేశారు. అంత ప్రాధాన్యత ఉన్న స్టీల్ ప్లాంట్‌ను 2008లో వైయస్సార్ సీఎంగా ఉన్నప్పుడు, ప్రధానిగా మన్మోహన్‌సింగ్ ఉన్నప్పుడు సుమారు రూ.11 వేల కోట్లతో కంపెనీని విస్తరించారని బొత్స గుర్తు చేశారు. అలాంటి పరిశ్రమను ఎన్డీఏ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి ప్రైవేటీకరణ దిశగా తీసుకుపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.ప్లాంట్ విషయంలో పార్టీలు ఒకరి మీద ఒకరు నిందించుకోవడానికి ఇది సందర్భం కాదని, గతంలో ఆ పరిశ్రమను ఎలా కాపాడుకున్నారో ఆలోచించాలని అన్నారు. గతంలో కూడా ఇలా ప్రైవేటీకరణ దిశలో ఆలోచించినప్పుడు, నాటి సీఎం వైయస్ జగన్, చాలా స్పష్టంగా చెప్పారని, ఇక్కడికి వచ్చి వీఎస్పీ కార్మిక సంఘాల నాయకులను కలిసి మాట్లాడారని, కేంద్రానికి లేఖ కూడా రాశారని గుర్తు చేశారు. కేంద్రంలో మిత్రపక్షాలకు ప్రాధాన్యత ఉందని, వాటిపై ఆధారపడి ప్రభుత్వం కొనసాగుతోందని గుర్తు చేశారు. ఇప్పుడు వ్యూహాత్మకంగా స్టీల్ ప్లాంట్‌ను అమ్మేసే దిశలో వెళ్తున్నారని, రెండు ఫర్నేస్‌లు ఆపేశారని.. ఈ సమయంలో కూడా అధికార పార్టీ నాయకులు ఒక్కో మాట మాట్లాడుతూ.. అందరినీ నమ్మించే ప్రయత్నం చేస్తున్నారని.. ఎమ్మెల్యే ఒకమాట. ఎంపీ ఒక మాట మాట్లాడుతున్నారని మండలి విపక్షనేత బొత్స ఆక్షేపించారు. కేంద్రంలోనూ, రాష్ట్రంలోనూ ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఉంది కాబట్టి, వారి విధానం ఏమిటో చెప్పాలని, వీఎస్పీ ప్రైవేటీకరణకు వ్యతిరేకమా? కాదా? చెప్పాలని.. ఏ విషయాన్ని సీఎం, డిప్యూటీ సీఎంతో చెప్పించాలని బొత్స సత్యనారాయణ డిమాండ్ చేశారు. ఇది ప్రజల మనోభావాలతో ముడి పడి ఉన్న అంశం కాబట్టి రాజకీయాలకు తావు లేదని తేల్చి చెప్పారు. 'ఒక్కటే అడుగుతున్నాం. స్టీల్ ప్లాంట్‌ను ఇలాగే కొనసాగిస్తారా? లేక ప్రైవేటీకరిస్తారా? ప్రధాని కూడా సమాధానం చెప్పాలి. విశాఖలో పర్యటించిన కేంద్ర ఉక్కు శాఖ మంత్రి, ప్రధానిని అడిగి ఏ విషయం చెబుతామని చెప్పారు. కాబట్టి, విశాఖ స్టీల్ ప్లాంట్‌పై మీ విధానం ఏమిటన్నది చెప్పాలని ప్రధానిని కూడా కోరుతున్నాం'. 'ఇది మా ఆత్మగౌరవానికి, ఇక్కడి ప్రజలకు సంబంధించిన అంశం. విశాఖ స్టీల్ ప్రైవేటీకరణ చర్యలను రాష్ట్ర ప్రభుత్వం ఆపుతుందా? లేదా? వెంటనే అడ్డుకోవాలని డిమాండ్ చేస్తున్నాం. స్టీల్ ప్లాంట్‌ను కాపాడాలని స్పష్టంగా కోరుతున్నాం' అని మండలి విపక్షనేత స్పష్టం చేశారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌ను కాపాడుకోవడం కోసం ఎంతవరకైనా పోరాడతామన్న బొత్స సత్యనారాయణ, తమకు రాజకీయ పార్టీలు ముఖ్యం కాదని, ప్రజాబలంతో పోరాడతామని చెప్పారు.

### రాజధానికి భూమి ఎలా ఇచ్చారో...ప్లాంట్ కోసం భూ దానం చేశారు..!

'అమరావతిలో రాజధాని కోసం రైతులు 35 వేలకు పైగా ఎకరాల భూమి ఇచ్చారని గొప్పగా చెబుతున్నారు కదా.. ఇక్కడి రైతులు కూడా 32 వేల ఎకరాలు ఇచ్చారు. ఆ విషయాన్ని ఎందుకు మర్చిపోతున్నారు?. ప్రధాని ఇప్పటికైనా తమ విధానం ఏమిటో చెప్పాలి? పీఎం, సీఎం స్పందించాలి' అని మండలి విపక్షనేత బొత్స స్పష్టం చేశారు.విజయవాడ వరదల బాధితులకు తమ పార్టీ నుంచి కోటి రూపాయల విలువైన సాయం చేశామన్న బొత్స సత్యనారాయణ, ఇప్పటికే లక్ష పాల ప్యాకెట్లు, రెండు లక్షల వాటర్ బాటిళ్లు ఇచ్చామని, ఒకటి, రెండు రోజుల్లో 50 వేల కుటుంబాలకు గ్రోసరీ అందజేయనున్నామని చెప్పారు. ఈ సమావేశంలో మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, మాజీ ఎమ్మెల్యేలు తిప్పల నాగిరెడ్డి, కరణం ధర్మశ్రీ, వైసీపీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు తదితరులు పాల్గొన్నారు.

## రవీంద్రనగర్ గ్రామస్తులకు సన్మానం



**విశాఖపట్నం, సెప్టెంబర్ 15, మేజర్‌న్యూస్**

దైవాశీస్సులే ధ్యేయంగా గత 11 ఏళ్లుగా గణపతి నవ రాత్రులు జరిపిస్తున్న దాతలకు ఘనంగా సన్మానించారు. కంచరపాలెం ఊర్వశి జంక్షన్ రవీంద్రనగర్ గ్రామస్తులు శ్రీ రాధా కృష్ణ శర్మ, వేణు సుబ్రహ్మణ్యం (లాయర్ ) బేతా భాస్కర రావు, కుమార్ రాజు, బేతా ఉమా, సత్యనారాయణ శర్మ, జగదీశ్, జగన్ మోహన్, నరసింహ మూర్తి, మౌళి, గాయత్రీ, లక్మి, సత్య, తదితరులను ఆదివారం స్థానికులు ఘనంగా సన్మానించారు. గత 11 సంవత్సరాల నుండి గణపతి నవరాత్రు లను ఎంతో భక్తిశ్రద్దలతో గ్రామానికి మంచి జరగాలన్న సదుద్దేశ్యంతోనే ఈ ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని నిర్వహకులు తెలిపారు. గ్రామ అభివృద్ధికి సహకరిస్తున్న లాయర్ వేణు సుబ్రహ్మణ్యం లాంటి వారిని సన్మానించుకోవడం అదృష్టంగా భావిస్తున్నామని చెప్పారు.

## సెల్‌ఫోన్లు చోరీ చేస్తున్న ముగ్గురి అరెస్టు

**విశాఖపట్నం, సెప్టెంబర్ 15, మేజర్‌న్యూస్**



సెల్‌ఫోన్లు చోరీ చేస్తున్న ముగ్గురు వ్యక్తుల్ని గాజువాక క్రైం పోలీసులు అరెస్టు చేశారు. క్రైం సీఐ కె.శ్రీనివాసరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. చింతపల్లికి చెందిన కర్ర చంటిబాబు విశాఖలో డెకరేషన్ పనుల కోసం వచ్చాడు. గాజువాకలోని ఓ వినాయక మండపంలో పని పూర్తి అనంతరం అక్కడే నిద్రకు ఉపక్రమించాడు. ఈ నేపథ్యంలో ఈ నెల 14న ఆయన మొబైల్‌ను చోరులు చోరీ చేశారు. దీంతో ఆయన గాజువాక క్రైం పోలీసుల్ని ఆశ్రయించారు. నగరంలో ఇదే నేరాలు మల్కాపురం, గాజువాకల్లో జరిగినట్టు తేలగా నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంకబ్రత బగ్చి ఆదేశాల మేరకు జేసీపీ డాక్టర్ ఫక్కీరప్ప, క్రైం డీసీపీ లతా మాధురి, జోన్-2 క్రైం ఏసీపీ ఇన్‌చార్జి వెంకటరావు ఆధ్వర్యంలో సీఐ శ్రీనివాస్, ఎస్ఐ మన్మధరావు ఓ బృందాన్ని ఏర్పాటు చేసి రంగంలోకి దించింది. కంచరపాలెనకు చెందిన నీలపు అనోకు (21), అదే ప్రాంతానికి చెందిన కర్రి హేమవర్ధం (23), వెంతురి యోగి (24)లే ఈ చోరీలకు పాల్పడుతున్నట్టు ప్రాథమికంగా గుర్తించారు. మొత్తం మూడు కేసుల్లో నాలుగు మొబైళ్లు చోరీ చేసినట్టు నిందితులు అంగీకరించడంతో ఆదివారం వారిని అరెస్టు చేశామని పోలీసులు తెలిపారు. జల్సాల కోసమే వీరు నేరాలకు పాల్పడుతున్నట్టు తేల్చారు. వారి నుంచి నాలుగు ఫోన్లతో పాటు ఓ ద్విచక్ర వాహనాన్ని కూడా స్వాధీనం చేసుకున్నారు. మొబైళ్ల పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

## అన్నదానంలో నగర మేయర్ దంపతులు



**ఆరిలోవ, సెప్టెంబర్ 15, మేజర్‌న్యూస్:**

జీవీఎంసీ 12వ వార్డు, పెద గదిలి శ్రీకృష్ణ యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో వినాయక చవితి మహోత్సవంలో భాగంగా అన్నదాన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మేయర్ గొలగాని హరి వెంకట కుమారి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సేవా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

## రేడియో సిటీ ఎఫ్ఎం ఆధ్వర్యంలో జరిగిన సిటీ కుక్

**అక్కయ్యపాలెం, సెప్టెంబర్ 15, మేజర్‌న్యూస్**



అక్కయ్యపాలెం పోర్ట్ స్టేడియంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. సందర్భంగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం కార్యక్రమంలో మహిళలు తయారు చేసిన వంటకాలను, స్టాల్స్ ను వంశీకృష్ణ పరిశీలించారు. కార్యక్రమంలో వంశీకృష్ణ శ్రీనివాస్ మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాల్లో పాల్గొనడం ద్వారా నైపుణ్యంతో పాటు మరెన్నో అవకాశాలు రావడా నికి దోహదపడుతుందని అన్నారు కార్యక్రమంలో నిర్వాహకులు , సతీష్ పాల్గొన్నారు.

## ప్రశాంతి నగర్‌లో మహా అన్నదానం



**ఆరిలోవ, సెప్టెంబర్ 15, మేజర్‌న్యూస్:**

శ్రీ వరసిద్ధి వినాయకాయక శరన్నవరాత్రి మహోత్సవ ములు సందర్భంగా ఆదివారం మధ్యాహ్నం ప్రశాంతినగర్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహిం చారు. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా 9వ వార్డు ఇంచార్జు బుడుమూరి గోవింద్ పాల్గొన్నారు.ఈకార్యక్రమంలో సుమారు1000మంది భక్తులు హాజరయై ప్రసాదాన్ని స్వీకరించారు.ఈకార్యక్రమంలో 9వ, వార్డు ప్రధాన కార్యదర్శి గడ్డవలసవెంకటరావు, హిల్ ఇంచార్జ్ ఒమ్మిరాజు, పి.లీలాకుమార్, గ్రామ అధ్యక్షులు రమణ, రాపాల్ గోవింద్, వెంకన్న కమిటి సభ్యులు,మహిళలు గ్రామప్రజానీకం, భక్తులు పాల్గొన్నారు.

## కార్పొరేటర్ దంపతులకు సత్కారం



**ఆరిలోవ, సెప్టెంబర్ 15, మేజర్‌న్యూస్:**

శ్రీ సిద్ధి వినాయక నవరాత్రి మహోత్స వములు సందర్భంగా శివాజీ నగర్-2 ముత్య మాంబ సేవా సంఘం, యూత్ సభ్యులు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని వార్డు కార్పొరేటర్ కెల్ల సునీత సత్యనారాయణ ప్రారంభించారు. అనంతరం సంఘం గౌరవ అధ్యక్షులు పిల్లి వీర్రాజు సంఘ సభ్యులు అప్పారావు మధు గణేష్ అశోక్ శివాజీ యూత్ సభ్యులు కార్పొరేటర్ కెల్లా సునీత సత్యనారాయణ ను సత్కరించారు.

## వినాయక యూత్ బాయ్స్ భారీ అన్న సమారాధన

**కే కోటపాడు, సెప్టెంబరు 15, మేజర్‌న్యూస్:**



మండలంలోని శ్రీ వినాయక యూత్ బాయ్స్ ఆధ్వర్యంలో అనుపు మహోత్సవం కార్యక్రమం లో భాగంగా ఆదివారం పురవీధుల్లో ఊరేగింపు నిర్వహిస్తూ,స్వామివారిని అనుపు మహోత్సవ నిర్వహించారు.12 గంటల నుంచి భారీ అన్న సమారాధన నిర్వహించారు.గ్రామ భక్తులతో పాటు పలు గ్రామాలు భక్తులు పాల్గొని స్వామి వారి ప్రసాదన్న స్వీకరించారు. సాయంత్రం 8 గంటల నుంచి స్వామివారిని పురవీధుల్లో నేల తాళాలతో వాయిద్యాలతో డిజె డాన్స్ లతో మహిళా కోలాటం మందుగుండు సామగ్రితో ఊరేగింపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాగిరెడ్డి మణికంఠ,ఎడ్ల దాలినాయుడు, షేక్ సలీం, యడ్ల రమేష్,షేక్ రసూల్,యడ్ల రాము, సాయి తోపాటు వినాయక యూత్ సభ్యులు పాల్గొన్నారు.

## తారువ గణనాథుడికి 100 కేజీల లడ్డు



**దేవరాపల్లి, సెప్టెంబర్ 15, మేజర్‌న్యూస్ :**

మండలంలోని తారువ గ్రామానికి చెందిన తెదేపా నాయకుడు రెడ్డి సురేష్ 100 కేజీల లడ్డు తయారు చేయించి దేవరాపల్లి మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు చిటిమిరెడ్డి సూర్యనారాయణ చేతుల మీదగా మహా గణనాథునికి ప్రత్యేక పూజలు నిర్వహించి లడ్డును అందజేశారు. ఈ లడ్డును అందజేసిన వారిలో రెడ్డి అశోక్, అల్లు శ్రీనివాసరావు ఉన్నారు. ఆదివారం వినాయక నవరాత్రుల మహోత్సవాల్లో భాగంగా మధ్యాహ్నం దేవరాపల్లి, నాగయ్యపేట, పలు గ్రామాలలో భారీ అన్న సమారాధన కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం నిమజ్జనోత్సవం కార్యక్రమాలు నాగయ్యపేట, కాశీపురం, పలు గ్రామాలలో ఈ మహాగణాధిపతి నిమజ్జోత్సవ కార్యక్రమాలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ నిమజ్జనం ఉత్సవ కార్యక్రమాలలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఎస్ఐ టి. మల్లేశ్వరరావు పర్యవేక్షణలో ఈ నిమజ్జోత్సవాలు జరుగుతున్నాయి.

## నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక" రద్దు

### - ఎస్పీ దీపిక పాటిల్

**అనకాపల్లి, సెప్టెంబర్ 15, మేజర్‌న్యూస్:**



ప్రతి సోమవారం అనకాపల్లి జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించే "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" (పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రెసెల్ సిస్టం, పిజిఆర్ఎస్) కార్యక్రమాన్ని ఈనెల 16వ తేదీన మిలాద్ ఉన్ నబి పండుగ సందర్భంగా ప్రభుత్వ సెలవు దినం కావడంతో రద్దు చేయడం జరిగిందని జిల్లా ఎస్పీ ఎం.దీపిక పాటిల్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించి, వచ్చే సోమవారం అనగా 23 వ తేదీన నిర్వహించే "ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం యధావిధిగా జరుగుతుందని, ప్రజలు గమనించాలని కోరారు.

## ఆక్రమణల పర్వము ఆగేనా..సాగేనా..!

### - అక్రమ నిర్మాణాలపై ఉక్కుపాదం మోపేనా- కోట్లాది విలువైన ప్రభుత్వ స్థలాలను కాపాడేనా

**నరసన్నపేట, సెప్టెంబర్ 15, మేజర్‌న్యూస్:**



నరసన్నపేట పట్టణ పరిధిలోని చెరువులు, ప్రభుత్వ స్థలాల ఆక్రమణ కొనసాగుతూనే ఉంది. ఆక్రమణలపర్వంపై అధికారులు ఉక్కు పాదం మోపేనా? కోట్లాది విలువైన ప్రభుత్వ స్థలాలను కాపాడేనా అనే ప్రశ్నలు స్థానిక ప్రజల్లో మెదులు తూన్నాయి. ప్రభుత్వాలు మారినా ఆక్రమణలు ఆగడం లేదు. ప్రభుత్వ ఆస్తుల కబ్జాలు కొనసాగుతూనే ఉన్నాయి. ఎటువంటి అనుమతులు లేని నిర్మాణాలు నిరంతరము జరుగుతూనే ఉన్నాయి. అధికారంలో ఎవరు ఉన్నా ఆక్రమణల పర్వం మాత్రం యధాతథం. గ్రామపంచాయతీ అధికారులు, రెవెన్యూ అధికారులు ఆక్రమణలు అడ్డుకోవడం, మళ్లీ అదే చోట ఆక్రమణలు మొదలు కావడం సర్వసాధారణం. పత్రికల్లో వచ్చిన వార్తల ఆధారంగా అక్రమ నిర్మాణాలపై అధికారులు ఆ ఒక్కరోజు హడావుడి చేసి చర్యలకు ఉపక్రమించడం, ఆతరువాత ఆ అక్రమ నిర్మాణాలపై కనీస శ్రద్ధ చూపకపోవడంతో పక్కాభవనాలు నిర్మాణాలు జరిగిపోతూ ఉంటాయి. ఇది నరసన్నపేట పరిసర ప్రాంతాల్లో మామూలు విషయమే అని స్థానిక ప్రజలు అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు. గత పాలకులు, అధికారులు ప్రస్తుత పాలకులు, అధికారులు, ఆక్రమణలకు అడ్డుకట్ట వేయడంలో సంపూర్ణ విఫలం చెందడం వల్ల ప్రభుత్వ భూములు చెరువులు అన్యాక్రాంతం కావడం అందరికీ తెలిసిన పచ్చి నిజం. తాజాగా మార్కెట్ యార్డును ఆనుకుని నిర్మాణ పనులుకొనసాగుతున్నాయి.నరసన్నపేట పట్టణంలో ప్రభుత్వ స్థలాల కబ్జాలు, అక్రమ నిర్మాణాలు తాజాగా జోరందుకున్నాయి. రెవెన్యూ, గ్రామ పంచాయతీ నుంచి ఎలాంటి అనుమతులు లేకున్నా నిర్మాణాలు గుట్టుచప్పుడు కాకుండా సాగించేస్తున్నారు. స్థానిక మార్కెట్ కమిటీ కార్యాలయం, జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న స్థలంలో అనుమతి లేని నిర్మాణాలు ప్రారంభమయ్యాయి. గొట్టిపల్లి సర్వే సంఖ్య 172తో పాటు బొడ్డవలస సర్వే సంఖ్య 13/1లో ప్రభుత్వ స్థలాన్ని గతంలో కొందరు ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారు. కంబకాయ కూడలి సమీపంలో రాతికర్రచెరువు స్థలంలో ఆక్రమణల పర్వం మొదలైంది. గతంలో కూడా ఈ చెరువు స్థలంలో ఆక్రమణలపై రెవెన్యూ శాఖ కఠినంగా వ్యవహరించగా, తాజాగా మరోసారి కబ్జాకు యత్నిస్తున్నారు. ఇలాంటి అనుమతి లేని నిర్మాణాలు ఎన్నెన్నో ఉండగా అనుమతి లేని నిర్మాణాలపై చర్యలు తీసుకుంటామని అధికారులు చెబుతున్నారు. ఏది ఏమైనా విలువైన కోట్లాది రూపాయలపభుత్వ ఆస్తులు అన్యాక్రాంతమవుతున్నాయి.

## పశు భీమా ...పాడి రైతుకు దీమా

### ప్రీమియంలో 80 శాతం సబ్సిడీ- పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో అమలు

**దత్తిరాజేరు, సెప్టెంబర్ 15, మేజర్‌న్యూస్:**



గత ప్రభుత్వం మూడేళ్లుగా ప్రభుత్వ పశు బీమా అమలు చేపట్టకపోవడంతో ఆ కాలంగా పాడి పశువులు మృత్యువాత పడి ఆర్థికంగా నష్టపోవడం జరిగింది. ఈ నేపథ్యంలో ఇటీవల నూతన ప్రభుత్వం పశు బీమా పథకం అమల్లోకి తెచ్చింది. ఈ పథకం మరింత ప్రయోజనకరంగా అమలయ్యేలా చర్యలు చేపట్టింది. తెల్ల రేషన్ కార్డు కలిగి ఉంటే పాడి రైతు చెల్లించే ప్రీమియం లో కేంద్ర ప్రభుత్వం 40%, రాష్ట్ర ప్రభుత్వం 40% సబ్సిడీ అందించి కేవలం 20 శాతం మాత్రమే చెల్లించి పశుబీమా పొందేలా పథకాన్ని అమలులోకి తెచ్చింది. అంతేకాదు ఇటీవల రాయితీ సొమ్మును కూడా జిల్లాకు కేటాయించడం జరిగింది. ఈ పథకం కింద ప్రభుత్వం మేలు జాతి పశువులకు 30,వేలు, నాటు జాతి పశువుకు 15వేలు వరకు భీమా వర్తిస్తుంది. ఒకవేళ రైతులు ఎవరైనా 30 వేలు పైబడి భీమా చేయించుకోవాలని భావిస్తే అదనంగా అయ్యే ప్రీమియంను రైతు చెల్లించుకునే వెసిలబాటు కూడా కల్పించింది. మూడేళ్ళ కాలవ్యవదికి బీమా ప్రీమియం చెల్లించడానికి రాయితీ అందిస్తుంది. అంతేకాకుండా పాడి పశువుల తో పాటు వ్యవసాయ పశువులు, గొర్రెలు మేకలు, పందులుకు కూడా బీమా పథకాన్ని అమలు చేస్తున్నారు. గొర్రెలు మేకలకు 6వేలు నష్టపరిహారంగా అందజేస్తారు. అయితే తొలి దశలో జిల్లాకు కేటాయించిన రాయితీ సొమ్ము బీమా ప్రీమియం చెల్లించడానికి ఖర్చు చేస్తే అదనంగా రాయితీ సొమ్మును విడుదల చేసేందుకు ప్రభుత్వం రెడీగా ఉంది అంటున్నారు. ఈ బీమా పథకం అమలు జిల్లాలో పశుసంవర్ధక శాఖ ద్వారా పాడి రైతులకు సంబంధించిన మార్గదర్శకాలను క్షేత్రస్థాయిలో తెలియజేసి భీమా చేపట్టేందుకు ఇప్పటికే అధికారులు చర్యలు చేపడుతున్నారు.

## ముచ్చెర్లలో డయేరియా వ్యాధి విజృంభణ...!

**ఆనందపురం, సెప్టెంబర్ 15, మేజర్‌న్యూస్:**

మండలంలోని ముచ్చర్ల గ్రామంలో డయేరియా వ్యాధి విజృంభిస్తుంది. సరైన ఆరోగ్య సహాయక చర్యలు లేక ప్రజలు విలవిలలాడుతున్నారు. ప్రతి ఇంటిలోనూ ఇద్దరు ముగ్గురు జ్వరాలతో మంచం పడుతున్నారు. ఇక్కడ డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండడంతో కాలవుల్లో మురుగునీరు పేరుకుపోయి దోమలు ఈగలు వృద్ధి చెందుతున్నాయి. ఇటీవల పడిన వర్షాలకు గ్రామంలో ఎక్కడకక్కడే నీరు నిల్వచేరి వ్యాధులు ప్రబలుతున్నట్లు స్థానికులు చెబుతున్నారు. ఈ గ్రామంలో ఇప్పటివరకు సుమారు 9మంది డయేరియా వ్యాధితో బాధపడుతున్నట్లు సమాచారం. పరిస్థితి ఇంత తీవ్రంగా ఉన్న స్థానికంగా ఉన్న ఏఎన్ఎం కూడా ఆరోగ్య సహాయక చర్యలు తీసుకోవడం లేదని గ్రామస్తులు చెబుతున్నారు. తక్షణమే ఉన్నతాధికారులు స్పందించి డ డయేరియా వ్యాధి నివారణ చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

## ఘనంగా ఒమ్మి సన్యాసిరావు జన్మదిన వేడుకలు

**ఆరిలోవ, సెప్టెంబర్ 15, మేజర్‌న్యూస్:**



తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ, విశాఖ జిల్లా యాదవ సంఘం అధ్యక్షులు, ఒమ్మి సన్యాసిరావు గ 59 వ పుట్టినరోజు వేడుకలు తోటగరువు వెర్రి దుర్గమాంబ గుడి వద్ద గల కల్యాణమండపములో ఘనంగా జరిగింది. ఈ వేడుకలు కు ముఖ్య అధిధులుగా విశాఖ పార్లమెంట్ సభ్యులు గీతం విద్యా, వైద్య సంస్థల అధ్యక్షులు శ్రీ భరత్ , విశాఖ తూర్పు శాసన సభ్యులు, వెలగపూడి రామకృష్ణ బాబు హాజరై ఎన్టీఆర్ ట్రస్ట్ ద్వారా ఏర్పాటు చేసిన రక్తధానశిబిరం ను ప్రారంభించిరి అనంతరం కేక్ కట్ చేసి ఘనంగా సన్మానించిరి అలాగే పెద మహిళలకు 200 మందికి చీరలు పంపిణి చేశారు. ఆరిలోవ ప్రాంతంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులందరికి నోట్ బుక్స్ పంపిణి చేస్తామని అన్నారు. సన్యాసిరావు ని టీడీపీ నాయకులు, జిల్లా యాదవ సంఘము నాయకులు, జనసేన, బీజేపీ, నాయకులు ఘనంగా సన్మానం చేసి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. రక్తదానశిబిరంలో 80మంది రక్తదానం లో పాల్గొన్నరు. ఈ కార్యక్రమంలో వార్డు ఇంచార్జి ఒమ్మి అప్పలరాజు, పార్లమెంట్ ఎస్సీ సెల్ అధ్యక్షులు బుడుమూరి గోవింద్ వార్డు అధ్యక్షులు, గాడి సత్యం,పార్లమెంట్ పార్టీ సెక్రటరీ ఏడువాక సన్యాసిరావు, వార్డు అధ్యక్షులు ముగడ రాజారావు, పొత్రకొండ ధర్మారావు, టీడీపీ, జనసేన, బీజేపీ, జిల్లా యాదవ సంఘము నాయకులు, అభిమానులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

## లారీ ఢీకొనీ ఆటో డ్రైవర్ మృతి

**ఆనందపురం, సెప్టెంబర్ 15, మేజర్‌న్యూస్:**



అనందపురం పోలీస్ స్టేషన్ పరిధిలో లారీ ఢీకొని వ్యక్తి మృతి వివరాల్లోకెళ్తే చిల్లా మాధవరెడ్డి, వయసు 51 సంవత్సరాలు ఆటో డ్రైవర్ గా పనిచేస్తూ శనివారం సాయంత్రం 4 గంటల సమయంలో తగరపువలస నుండి చేపల వ్యాపారం చేసుకున్న నటువంటి రమ్య ,గరగయమ్మ, ఎప్పటిలాగే ఆటోలో తీసుకొని లంకెలపాలెం బయలుదేరగా చెరువు చేపలు కొనుక్కొని తిరిగి బయలుదేరగా అదే ఆటోలో తగపువలస చూస్తుండగా శనివారం అర్ధరాత్రి మిందివానిపాలెం వద్ద ఆటో చక్రం పంచర్ అవడం వల్ల ఆటోను మాధవరెడ్డి రోడ్డు ప్రక్కన ఆపి టైర్ మార్చే సమయంలో పెందుర్తి వైపు నుండి ఆనందపురం వైపుగా వచ్చే సిమెంట వే అతి వేగంగాగంతో వచ్చి మాధవరెడ్డిని ఢీకొని కొంత దూరం ఈడ్చుకుపోవడంతో మాధవరెడ్డి లారీ చక్రం కింద పడి అక్కడికక్కడే మృతి చెందాడు. ఆటోలో ఉన్న ఇద్దరు మహిళలకు చిన్నచిన్న గాయాలతో బయటపడ్డారు వెంటనే స్థానిక ఎన్నారై హాస్పిటల్లో చికిత్స నిమిత్తం పంపించారు చిల్లా వెంకట్ రెడ్డి ఫిర్యాదు మేరకు ఆనందపురం సర్కిల్ ఇన్స్పెక్టర్ సిహెచ్ వాసు నాయుడు ఆధ్వర్యంలో ఎస్సై శివ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నవ్య కన్స్ట్రక్షన్స్ వారి ఆధ్వర్యంలో

# గణేష్ పూజ మహోత్సవములు



విశాఖపట్నం, సెప్టెంబర్ 15, మేజర్‌న్యూస్:

ఉషోదయ జంక్షన్, ఎంవిపి కాలనీ సెక్టార్- 11 లాసన్స్ బే కాలనీలో నవ్య కన్స్ట్రక్షన్స్ వారి ఆధ్వర్యంలో వైభవంగా గణేష్ పూజ మహోత్సవంలు నిర్వహించారు సాంప్రదాయ పూజలు, కుంకుమ పూజలు, ఆదివారం మధ్యాహ్నం సుమారు 2500 పైగా భక్తులకు భారీ అన్న దానం కార్యక్రమంను నిర్వహించారు ఈ యొక్క కార్యక్రమంలో విశాఖ తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణ బాబు స్వామి వారిని దర్శించుకొని భక్తులకు ప్రసాద వితరణ చేశారు అదేవిధంగా ఆదివారం సాయంత్రం స్వామివారి అణుపు ఊరేగింపు కార్యక్రమమును అంగం ́ంగ వైభవంగా నిర్వహించామని సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ మన్యం విజయకుమార్ తెలియజేశారు ఈ కార్యక్రమంలో సంస్థ ఉద్యోగులు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## వరద బాధితులకు సుందరాడ నాయకులు విరాళం

50 వేలు నగదు ఎమ్మెల్యే బేబీ నాయన అందించిన నాయకులు



తెర్లాం, సెప్టెంబరు 15, మేజర్‌న్యూస్:

మండల పరిధిలోని సుందరాడ గ్రామ కోటమ నాయకులు ఆదివారం బొబ్బిలి ఎమ్మెల్యే ఆర్ వి ఎస్ ఆర్ రంగారావు (బేబీ నాయన)కు రూ. 50,000 తుఫాను బాధితులకు వితరణ చేశారు. ఇటీవల తుఫాను బీభత్సానికి విజయవాడ కృష్ణ గుంటూరు జిల్లాల తుఫాను ప్రభావిత ప్రాంతాలకు జరిగిన నష్టాన్ని పూడ్చేందుకు చంద్రుకో నూలు పోగుల బొబ్బిలి నియోజకవర్గం లో ప్రతి మండలం నుంచి విరాళాలపర్వం జరుగుతూనే వస్తుంది. ఈ సందర్భంగా బొబ్బిలి ఎమ్మెల్యే ఆర్ వి ఎస్ ఆర్ కె రంగారావు బేబీ నాయన మంచితనానికి ఉదారతకు పేరెన్నికి గన్న బేబీ నాయన చేతుల మీదుగా ముఖ్యమంత్రి సహాయ నిధికి విరాళాలు తండోపతండోలుగా ప్రకటించడం హర్షదాయకం. వరద బాధితులపై సానుభూతిపరులు సహాయక చర్యలపై స్పందించి భారీ ఎత్తున విరాళాల ప్రకటించడం మానవతా దృక్పథానికి నిదర్శనం. ఈ సందర్భంగా సుందరాడ గ్రామానికి చెందిన కూ టమి నాయకులు మాజీ సర్పంచ్ గుండాల అప్పన్న జి మురళి అర్జునరావు దాకారపు మన్మధరావు ఎన్. దాసు ఆర్ సత్యం తదితరులు విరాళాలు అందించిన వారిలో ఉన్నారు.

## త్రుటిలో తప్పిన పెను ప్రమాదం

నరసన్నపేట, సెప్టెంబర్ 15, మేజర్‌న్యూస్ :



నరసన్నపేట పట్టణంలో స్థానిక రామాలయం ఎదురుగా ఒక లగేజ్ ఆటో మనుషలను తప్పించబోయి డివైడర్ పైకి దూసుకుపోయి అవతలి రోడ్డుపై ప్రయాణం చేస్తున్న ప్రయాణికుల ఆటో పై పడింది. ఆటోలో ప్రయాణిస్తున్న ఇరువురు వ్యక్తులకు గాయాలు కాగా వారిని ఆసుపత్రికి తరలించారు. పల్టీ కొట్టిన ఆటోను స్థానికుల సహకారంతో పైకెత్తి నిలిచిన ట్రాఫిక్ ను చక్కదిద్దిన స్థానికులు. తృటిలో పెద్ద ప్రమాదం తప్పిందని స్థానికులు తెలియజేశారు. నరసన్నపేట పట్టణ రహదారులపై నిరంతరము ఇటువంటి సంఘటనలు చోటు చేసుకోవడం పరిపాటిగా మారిందని, ట్రాఫిక్ నియంత్రణపై పోలీసుల జోక్యం లేకపోవడంతో ఇష్టరాజ్యాంగ వాహనాలు నడపడం కనీస ట్రాఫిక్ నియమాలు పాటించక పోవడం వల్ల ఇటువంటి ప్రమాదాలు సంభవిస్తున్నాయని అక్కడకు చేరిన వారు తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఇప్పటికైనా పోలీస్ శాఖ వారు స్పందించి ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

## స్థానిక గ్రంథాలయములో పిల్లలచే పుస్తక పఠనం

తెర్లాం, సెప్టెంబరు 15, మేజర్‌న్యూస్:



స్థానిక గ్రంథాలయంలో గ్రంథాలయ అధికారి సిహెచ్ కృష్ణ మూర్తి ఆధ్వర్యంలో ఆదివారం చద వడం మాకిష్టం అన్న కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పిల్లలకు పలు రకాల నీతి కథలు వీర కథలు పుస్తక పఠనం జరిపించారు. అలాగే హాస్య కథలు విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు డాక్టర్ సుభాష్ చంద్రబోస్ వీరకథలు చదివించి వాటిని పిల్లలకు పలు సూక్తులు ద్వారా అందించారు. పిల్లలు చదువు పట్ల ఆసక్తి కలిగి పాఠశాలలో బాగా చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలంటే ఇలాంటి నీతి కథలు భవిష్యత్తులో మీకు ఉపయోగపడతాయని విద్యార్థులకు సూచించారు. అలాగే పాఠకులు గ్రంథాల యానికి వచ్చి మానసిక ఉల్లాసం మనోవికాసానికి దోహద పడుతుందని అందుకు గ్రంథాలయం పట్ల మక్కువ చూపి ప్రతి రోజు గ్రంథాలయానికి వచ్చే పుస్తక చేయాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా ఆయనతోపాటు నెమలం పాఠశాల ఉపాధ్యాయుడు కె విస్సు విద్యార్థులు పాఠకులు తదితరులు పాల్గొన్నారు.

## లెప్పర్సీ కాలనీలో పేదలకు అన్నదానం

ఆమదాలవలస, సెప్టెంబర్ 15, మేజర్‌న్యూస్:



ఆమదాలవలస పట్టణం లెప్పర్సీ కాలనీలో కృత్విక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పేదలకు ఆదివారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. పురుషోత్తపురం గ్రామానికి చెందిన కిల్లి వెంకట శేషు మోహన్ పుట్టినరోజు సందర్భంగా ఈరోజు పేదలకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగినట్లు కృతిక ఫౌండేషన్ ఫౌండర్ చిగురుపల్లి చిన్ను తెలియజేశారు. సమాజ సేవ చేసేందుకు ప్రతి ఒక్కరు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. పేదలకు సేవ చేసేందుకు కృత్విక్ ఫౌండేషన్ లక్ష్యమని తెలిపారు. ప్రతి శుభకార్యానికి దాతల సహకారంతో పేదలకు సేవా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈరోజు సుమారు 45 మంది అనాథలకు,వృద్ధులకు,వికలాంగులకు అన్నదానం చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆనంద్,రాము,లక్ష్మణ్,సాయి,రామారావు పాల్గొన్నారు.

## మద్యం సీసాలో బొద్దింక దర్శనం!

నరసన్నపేట, సెప్టెంబర్ 15, మేజర్‌న్యూస్ :




నరసన్నపేట పట్టణంలోని ఓ ప్రభుత్వం కొనుగోలు చేసిన మద్యం సీసాలో బొద్ధంక కానరావడంతో ఈ విషయం సామాజిక మాధ్యమాల ద్వారా హల్చల్ చేసింది. కోమార్తి గ్రామానికి చెందిన అప్పన్న నరసన్నపేట పట్టణంలోని మద్యం దుకాణంలో కొనుగోలు చేసిన మద్యం సీసాలో బొద్దంకి దర్శనం ఇవ్వడంతో అవాక్కయ్యాడు. దీనిపై ఎటువంటి ఫిర్యాదు చేయకపోవడంతోవిషయం సద్దుమణిగింది.

# శ్రీకశ్యప్‌లో ఘనంగా ఫ్రెషర్స్ డే



విశాఖపట్నం, సెప్టెంబరు 15, మేజర్‌న్యూస్:

రామాటాకీస్ దరి శ్రీకశ్యప్ డిగ్రీ కళాశాల విద్యార్థులు ఆదివారం అల్లూరి భవన్‌లో నిర్వహించిన 'ఫ్రెషర్స్ డే' వేడుకలు అదుర్స్ అనిపించాయి. నూతన విద్యార్థుల పరిచయ కార్యక్రమాన్ని సీనియర్లు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ టీఆర్ఎన్ వర్మ మాట్లాడుతూ తమ కళాశాలలో అత్యుత్తమ అధ్యాపక బృందంతో విద్యార్థులకు నాణ్యమైన విద్యా బోధన అందిస్తున్నారని కొనియాడారు. భవిష్యత్తులో ఈ విద్యార్థులంతా సమాజ సేవ కోసం పాటు పడాలని ఆకాంక్షించారు. ప్రిన్సిపాల్ ఎస్.నారాయణ మూర్తి మాట్లాడుతూ తమ కళాశాలలో క్రీడలకు ప్రోత్సహం ఉంటుందన్నారు. వైస్ ప్రిన్సిపాల్ ఎల్. జ్యోత్స్నరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు సీఆర్‌టీ శిక్షణ, సర్టిఫికెట్ కోర్సులు అందుబాట్లో ఉన్నాయన్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందర్నీ అలరించాయి. కార్యక్రమంలో విద్యార్థులు, అధ్యాపక బృందం పాల్గొంది.





# గత ప్రభుత్వ తప్పిదమే రోడ్డుకు గ్రహణం

ఆమదాలవలస, సెప్టెంబర్ 15, మేజర్‌న్యూస్:



ఆమదాలవలస, శ్రీకాకుళం మధ్య రోడ్డు విస్తరణ పనులు గత వైసీపీ ప్రభుత్వం అలసత్వం , అవినీతి, రాజకీయ దురుద్దేశం వలనే రోడ్డు పనులు సకాలంలో సాగలేదని, గత పాలకులు చేసిన తప్పిదాలు ప్రజలకు నేడు శాపంగా మారాయని ఎమ్మెల్యే కూన రవికుమార్ ఆరోపించారు. శనివారం ఫ్లైఓవర్ బ్రిడ్జి నుండి రాగోలు వరకు పార్టీ శ్రేణులతో కలిసి రోడ్డును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు పనులు కోసం 2018లో 38 కోట్లు మంజూరు చేసి పనులు ప్రారంభించినప్పటికీ ఆ తరువాత అధికారం చేపట్టిన వైసీపీ ప్రభుత్వం రాజకీయ దురుద్దేశంతో రోడ్డు పనులు చేపట్టకుండా నిధులు మళ్లించారని మండిపడ్డారు. మూడేళ్లు తర్వాత వైసీపీ ప్రభుత్వం నాయకులు పనులు ప్రారంభించినప్పటికీ సకాలంలో నిధులు మంజూరు చేయకపోవడంతో బిల్లు లేక కోట్ల రూపాయలు వెచ్చించిన కాంట్రాక్టర్ పనులు నిలుపుదల చేశారని చెప్పారు. కాంట్రాక్టర్ కు గత ప్రభుత్వం 14 కోట్ల రూపాయల పైన చెల్లించవలసి ఉందని గుర్తు చేశారు. అధికారం చేపట్టాక ఆమదాలవలసు శ్రీకాకుళం మధ్య రహదారి దుస్థితిని ముఖ్యమంత్రి దృష్టికి, ఆర్థిక మంత్రి దృష్టికి, రోడ్లు భవనాల శాఖ మంత్రి దృష్టికి తీసుకువెళ్లామని చెప్పారు. వారంతా సానుకూలంగా స్పందించి నిధులు మంజూరుకు హామీ ఇచ్చారని అన్నారు. ఈ నెలాఖరు నాటికి రోడ్డు వేయాలి అన్నదే తనది, శ్రీకాకుళం ఎమ్మెల్యే శంకర్ లక్ష్యమని తెలిపారు. గత వైసిపి ప్రభుత్వం 12 లక్షల కోట్ల అప్పులు చేసిందని, రాష్ట్రవ్యాప్తంగా వివిధ పనులకు సంబంధించి,(అన్ని రకాల బిల్లులు) ?1,30,000 వేల కోట్లు బిల్లులు పెండింగ్ ఉంచారని మండిపడ్డారు. ఆ తప్పిదాలను నేటి ప్రభుత్వం పూడ్చిస్తూ వస్తుందని అన్నారు. ఇప్పటికే కాంట్రాక్టర్ తో మాట్లాడామని ప్రభుత్వం కూడా బిల్లు ఇచ్చేందుకు భరోసా ఇచ్చిందని వివరించారు. 14 కోట్ల బిల్లులు గతం ప్రభుత్వం పెండింగ్ లో పెట్టిందని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. కాంట్రాక్టర్ కూడా పనులు చేపట్టేందుకు ముందుకు వచ్చారని ఇటీవల వర్షాలు బాగా పడటంతో పనులు నిలిచిపోయి అన్నారు. ఎక్కువ వర్షాలుకు తోడుగా ఒరిస్సా నుండి టన్నులు కొద్ది బరువు గల వాహనాలు రోడ్డు పై నుండి రాకపోకలు సాగించడంతో గోతులు ఏర్పడ్డాయని అన్నారు. రెండు రోజుల క్రితం ఫ్లైఓవర్ సమీపంలో లారీలు బురదలో ఉండిపోవడానికి అదే కారణమని చెప్పారు. అధికారులతో మాట్లాడి వెంటనే రోడ్డుని సరి చేయడం జరిగిందని గుర్తు చేశారు. ప్రజలు రాకపోకలు సాగించేందుకు ఎటువంటి ఆటంకం లేకుండా రెండు వైపులా ఈ నెల చివరి నాటికి తారు రోడ్డు వేయిస్తామని, సెంటర్ డివైడర్స్, కలవర్ట పనులు సైడ్ కాలువలు పనులు ఆనేవి చేపట్టేందుకు మరి కొన్ని నెలల సమయం పడుతుందని చెప్పారు. మా ప్రభుత్వం ఏర్పడి వంద రోజులు నిన్నటికి పూర్తి అయినప్పటికీ ప్రజా శ్రేయస్సు ప్రామాణికంగా అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని ఎమ్మెల్యే తెలిపారు. ఈ పరిశీలన కార్యక్రమంలో జనసేన నియోజకవర్గం కన్వీనర్ పేడాడ రామ్ మోహన్ రావు తెలుగుదేశం నాయకులు అధికారులు పాల్గొన్నారు.

# పేట బజారు... బహుబేజారు...!

- నిరుపయోగంగా గ్రామపంచాయతీ దుకాణ సముదాయాలు- రోడ్డుకు ఇరువైపులా వ్యాపారాలు, తప్పని ట్రాఫిక్ ఇక్కట్లు- అధికారులు, పాలకులు ఒక్కరోజు హడావుడి తప్పచేసింది ఏమీ లేదు



నరసన్నపేట, సెప్టెంబర్ 15, మేజర్‌న్యూస్:

నరసన్నపేట మేజర్ పంచాయతీ పరిధిలో లక్షలాది రూపాయలు వెచ్చించి నిర్మించిన కూరగాయల మార్కెట్ నిరుపయోగంగా మారడంతో, రోడ్ ఎక్కిన వ్యాపారం. పట్టణ ప్రధాన రహదారి నుండి, కళాశాల రహదారి, బజారు ప్రాంతంలో రోడ్ల కి ఇరువైపులా వ్యాపారాలు నిర్వహిస్తూ పట్టణ వాసులకు పట్టపగలే చుక్కలు చూపిస్తున్నారు. నిరంతర ట్రాఫిక్ లతో ఇబ్బందులకు గురి చేస్తున్నారు. స్పందించవలసిన గ్రామపంచాయతీ యంత్రాంగం, నరసన్నపేట పోలీస్ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడంతో ట్రాఫిక్ సమస్య పరిష్కారం కావడం లేదు. బజారు నిర్వహణ సరిగా లేదు. మార్కెట్ ప్రాంతంలో నిర్మించిన దుకాణాలు ఖాళీగా దర్శనమిస్తూ అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారాయి . దుకాణాలలో వ్యాపారం చేయవలసిన వ్యాపారులు రోడ్లపై కొచ్చి రోడ్లను ఆక్రమించుకుని వ్యాపారాలు నిర్వహిస్తున్నారు. జిల్లాలో ఏ ప్రాంతంలో లేని పరిస్థితులు ఒక్క నరసన్నపేటలోనే కనిపిస్తున్నాయి. ఎక్కడైనా మార్కెట్లోని షాపులలో కూరగాయలు ఇతర నిత్యవసర వస్తువులు అమ్మకాలు జరుపుతారు గానీ నరసన్నపేట ప్రాంతంలో మాత్రం రోడ్లపైనే వ్యాపారం నిర్వహిస్తారు ఇదే నరసన్నపేట ప్రత్యేకం. ఇక్కడకు సుమారు 30 గ్రామాల నుండి ప్రజలు వారి నిత్యవసరాల కోసం వస్తూ పోతూ ఉంటారు. జిల్లాలో వ్యాపార కార్యకలాపాలలో అత్యంత రద్దీ కలిగిన ప్రాంతంగా నరసన్నపేటకు పేరు ఉంది. సదుపాయాల కల్పనలో మాత్రం చివరి స్థానంలోనే ఉంది. గ్రామపంచాయతీ ప్రధాన ఆదాయవనరుగా స్థానిక మార్కెట్ ను ఉపయోగించుకుంటుంది గాని మార్కెట్లోని వినియోగదారులకు కల్పించవలసిన కనీస సౌకర్యాలపై దృష్టి సారించకపోవడంతో బజారు బహుబేజారుగా మారింది. పాలకులు, అధికారులు అప్పటికప్పుడు చేసే హడావుడి తప్ప మార్కెట్ పరిసరాల అభివృద్ధి, నిర్వహణ, ట్రాఫిక్ నియంత్రణపై ఎటువంటి దృష్టి సారించకపోవడం పట్టణ ప్రత్యేకత.

# నూరేళ్ల సాహితీవేత్తను సత్కరించిన గౌరీ నాయుడు



లక్కవరపుకోట, సెప్టెంబర్ 15, మేజర్‌న్యూస్:

జీవన ప్రస్థానంలో నూరు వసంతాలు పూర్తిచేసుకుని 101వ సంవత్సరంలోకి అడుగుపెట్టిన ప్రముఖ వైద్యుడు, అనువాదకుడు, రచయిత, డాక్టర్ రాచకొండ నరసింహ శర్మ ను యువ సాహితీవేత్త డాక్టర్ కిలారి గౌరీ నాయుడు ఆయన స్వగృహం లో కలుసుకుని ఆయన ఆశీర్వాదాలు తీసుకుని మెమొంటోతో ఆయన్ని సత్కరించినట్లు గౌరినాయుడు తెలిపారు. రాచకొండ నరసింహ శర్మ వైద్యరంగంలో, సాహిత్య రంగంలో తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్నిసంపాదించుకున్నారు అని . వందేళ్లు దాటిన తర్వాత కూడా చదవటం, రాయడం వారి దినచర్యలో ఒక భాగంగా ఉండడం గొప్ప విశేషమని గౌరీ నాయుడు పేర్కొన్నారు. నేటి యువతరం నరసింహ శర్మ ను ఆదర్శంగా తీసుకోవాలని గౌరీ నాయుడు సూచించారు. 13 ఏళ్లుగా రాచకొండ నరసింహ శర్మ గారితో తనకున్న సాహిత్య అనుబంధాన్ని ఈ సందర్భంగా గౌరీ నాయుడు గుర్తు చేసుకున్నారు. సాహిత్య రంగంలో కృషి చేస్తున్న కవులను, రచయితలను ప్రోత్సహించడానికి, విద్యార్థులలో సృజనాత్మకతను పెంపొందించే కార్యక్రమాలను నిర్వహించడానికి రాచకొండ నరసింహ శర్మ సాహితీ సంస్థ స్థాపించి సాహిత్య రంగానికి నరసింహ శర్మ తన వంతు సహకారం అందిస్తున్నారనిగౌరీ నాయుడు తెలిపారు. ఈ సందర్భంగా నరసింహ శర్మను విశాఖపట్నంలో వారి స్వగృహంలో మర్యాదపూ ర్వకంగా కలిసి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపిఘనంగా సన్మానించారు. రాచకొండ నరసింహ సాహితీ సంస్థ ఉపాధ్యక్షుడిగా గౌరీ నాయుడు చేపడుతున్న సాహిత్య, సంగీత, సాంస్కృతిక, కళారంగాల కార్యక్రమాల పట్ల ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఈ సంస్థ తరపున ఎన్నో వినూత్న కార్యక్రమాలు నిర్వహించాలని తనకు పెద్దాయన తెలిపారని ఆయన ఆజ్ఞను శిరసావహిస్థానని తెలియజేశారు. కార్యక్రమంలో సంతోష్ కుమార్, వెంకటరత్నం, అప్పారావు, అర్జున్, తదితరులు పాల్గొన్నారు.

# ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం విద్యార్థిని అదృశ్యం



నరసన్నపేట, సెప్టెంబర్ 15, మేజర్ న్యూస్:

నరసన్నపేట పట్టణంలో ఒక ప్రైవేట్ కళాశాలలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న యారబాటి శిరీష ఈనెల 14వ తేదీ నుండి కనిపించడం లేదని తండ్రి యారబాటి దాలయ్య నరసన్నపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. సారవకోట మండలం అలుదు గ్రామానికి చెందిన యారబాటి దాలయ్య తన కుమార్తె యారబాటి శిరీష నరసన్నపేటలోని ఒక ప్రైవేట్ కళాశాలలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం బైపిసి చదువుతుందని, 14వ తేదీన కళాశాల బస్సులో బయలుదేరిన తమ కుమార్తె సాయంత్రం ఇంటికి చేరుకోకపోవడంతో, వెంటనే కళాశాలకు వెళ్లి పరిశీలించి సిబ్బందిని ప్రశ్నించగా 14వ తేదీ ఉదయం నుండి మధ్యాహ్నం వరకు కళాశాలలో ఉండి తదుపరి కళాశాలలో కనిపించలేదని తెలియజేసారని, వెంటనే తమ బంధువులు ఇళ్ళలో ఫోన్ ద్వారా సంప్రదించగా అక్కడ కూడా లేకపోవడంతో నరసన్నపేట పోలీసులకు తన కుమార్తె ఆచూకీ కనుగొనవలసిందిగా శిరీష తండ్రి దాలయ్య ఫిర్యాదు చేశారు. నరసన్నపేట పోలీసులు విద్యార్థిని తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అదృశ్య కేసుగా నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు నరసన్నపేట ఎస్సై దుర్గాప్రసాద్ తెలియజేశారు.

డీ 7 యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో

# వినాయక లడ్డు వేలం పాట

ఆమదాలవలస, సెప్టెంబర్ 15, మేజర్‌న్యూస్:



ఆమదాలవలస పట్టణం మోనింగి వారి వీధిలో డి సెవెన్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన వినాయక చవితి పంచమి రాత్రి ఉత్సవాలు ముగిశాయి. దీంతో శనివారం రాత్రి నిమజ్జన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గణపతి లడ్డును వేలం వేయగా భవిత స్కూలుకు చెందిన సువ్వారి మురళీధర్ రావు, సునీత దంపతులు దక్కించుకున్నారు. వేలంపాటలో రూ.11 వేలుకు లడ్డూను పాడుకున్నారు. నిమజ్జనోత్సవం సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాల మధ్య ఆనందంగా జరిపారు.

## విజయవాడ వరద బాధితుల సహాయార్థం 20,000 సహాయం

జిల్లా ల్యాబ్ టెక్నీషియన్స్ అసోసియేషన్ వారి సహకారం

- సీఎం సహాయ నిధి పేరుమీద చెక్కును
- శ్రీకాకుళం శాసనసభ్యులు గొండు శంకర్‌కు అందజేసిన ల్యాబ్ టెక్నీషియం అసోసియేషన్ సభ్యులు



శ్రీకాకుళం, సెప్టెంబరు 15, మేజర్‌న్యూస్:

శ్రీకాకుళం జిల్లా ల్యాబ్ టెక్నీషియన్ అసోసియేషన్ వారు విజయవాడ వరద బాధితుల సహాయార్థం 20000 రూపాయల సేకరించి ముఖ్యమంత్రి సహాయ నిధికి అందజేసేందుకు చెక్కు రూపంలో శ్రీకాకుళం శాసనసభ్యులు గొండు శంకర్ కు ఆదివారం ఉదయం శ్రీకాకుళంలో ల్యాబ్ టెక్నీషియన్ అసోసియేషన్ సభ్యులు అందజేశారు. ఈ సందర్భంగా శాసనసభ్యులు ల్యాబ్ టెక్నీషియన్ సభ్యులకు అభినందించారు. కార్యక్రమంలో పలువురు ల్యాబ్ టెక్నీషియన్ ప్రతినిధులు, తెలుగుదేశం నాయకులు పాల్గొన్నారు.

## బుచ్చోడి చెరువుపై వంతెన నిర్మాణం కొరకు పరిశీలిస్తున్న ఎంపీ కలిశెట్టి

రణస్థలం, సెప్టెంబరు 15, మేజర్‌న్యూస్:



పెద్దశేరి - కోటపాలెం శ్రీ శ్రీ శ్రీ భద్ర మహంకాళి అమ్మవారిని ఆదివారం విజయ నగరం ఎంపీ కలిసెట్టి అప్పల నాయుడు దర్శించుకుని అనంత రం గుడికి ఆనుకుని ప్రక్కనే ప్రవహిస్తున్న బుచ్చోడి గెడ్డపై వంతెన నిర్మాణం కొరకు పరిశీ లన చేశారు. హెడ్ క్వార్టర్ రణస్థలం నుండి సముద్ర తీర ప్రాంతా నికి ఆనుకొని ఉన్న గ్రామాలైన సుందర పాలెం,కొచ్చర్ల, జీరుపాలెం తదితర గ్రామా లకు వెళ్లే రోడ్డు మార్గంలో కోటపాలెం పెద్దశేరి వద్ద శ్రీ భద్ర మహంకాళి గుడి వద్దకు వచ్చేసరికి బుచ్చోడి గెడ్డపై ఉన్న కల్వెర్ట్ దగ్గర ఇటీవల కురిసిన భారీ వర్షా ల ప్రభావానికి గెడ్డ ఉప్పొంగడంతో, గెడ్డకు అటు ఇటు వైపు ఉన్న గ్రామాల ప్రజల రాకపోకలకు కలిగిన ఇబ్బందిని ఎంపీ గారి దృష్టికి తీసుకురాగా,ఈరోజు విజయ నగరం పార్లమెంట్ సభ్యులు కలిశెట్టి అప్పలనా యుడు ప్రజల క్షేమం దృష్ట్యా, అవసరాలు దృష్ట్యా సదరు బుచ్చోడు గెడ్డపై వంతెన నిర్మాణం కొరకు పరిశీలన చేసినారు.

## వైద్య శిబిరాన్ని ప్రారంభించిన గొండు శంకర్



శ్రీకాకుళం, సెప్టెంబరు 15, మేజర్ న్యూస్:

ప్రముఖుల జ్ఞాపకార్థం వైద్య శిబిరాన్ని కుటుంబ సభ్యులు, గ్రామ ప్రజలు సంయుక్తంగా ఆదివారం గార మండలం అంబటివానిపేట గ్రామంలో ఏర్పాటు చేశారు. స్వర్గీయ అంబటి గోవిందరావు పేరుమీద వైద్య శిబిరాన్ని శ్రీకాకుళం శాసనసభ్యులు గొండు శంకర్ ప్రారంభించి మాట్లాడుతూ ప్రముఖుల జ్ఞాపకార్థం వైద్య శిబిరాలు నిర్వహించడం ద్వారా గ్రామాలలో ఉన్న ప్రజలకు చాలా ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. కుటుంబ సభ్యులు, గ్రామ పెద్దలు, వైద్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## బంటుపల్లిలో భారీ అన్నదానం

రణస్థలం, సెప్టెంబరు 15, మేజర్ న్యూస్:



మండలంలోని బంటుపల్లి గ్రామంలో ఆదివారం భారీ అన్నదానం జరిగింది. స్థానిక సర్పంచ్ నడుకుదిటి రజని, ఎన్ఇఆర్ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ డైరెక్టర్ ఎన్. తేజ బాబు ఆధ్వర్యంలో సుమారు 2వేల మందికి అన్నప్రసాద వితరణ నిర్వహించారు. గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్టు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు (ఎన్ఇఆర్)పాల్గొని అన్న ప్రసాదం ప్రారంభించారు. వినాయక నవరాత్రి ఉత్సవాలు ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు ఆధ్వర్యంలో ప్రారంభించి 12 ఏళ్ళు అయిన సందర్భంగా 12 కేజీల లడ్డును వేలం గణపతి మండపం వద్ద ఏర్పాటు చేసారు. ఈ వేలంలో వెలిచేటి సురేష్ కుమార్ మరియు టీం సభ్యులు 50 వేలుకు దక్కించు కున్నారు. ఈ సందర్బంగా ఎమ్మెల్యే ఎన్ఇఆర్ మాట్లాడుతూ గ్రామాల్లో ఇటువంటి కార్యక్రమాలు చేయటం వలన ఐక్యత పెరుగుతుందన్నారు. దీనిద్వారా గ్రామాలు అభివృద్ధికి దోహద పడుతుందాన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షు లు పైడి వేణుగోపాలం, ఎస్. నాగేశ్వరావు, చింతపల్లి వెంకటరాజేష్, గోపిన కృష్ణా రావు, టి.అప్పలరాజు, ముంగం శ్రీనివాసరావు, గురాన జనార్దన్, సప్ప గంగులు, జాడ పందు, తిరుమరెడ్డి సతీష్, ఎల్లుటి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా వినాయక నిమజ్జనం

రామభద్రపురం, సెప్టెంబర్ 15, మేజర్‌న్యూస్:

మండల కేంద్రంలో ఆదివారం సాయంత్రం వినాయక నిమజ్జన ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు పెద్ద ఎత్తున కోలాటాలు బిందెల డాన్స్ తీన్మార్ డప్పులు ఈ ఊరేగింపు అత్యంత వైభవంగా నిర్వహించారు ఈ సందర్భంగా సంస్కృతి కార్యక్రమముతో పాటు అన్నదాన కార్యక్రమం కూడా పెద్ద ఎత్తున నిర్వహించారు బూసెయ్యవలస గ్రామంలో వినాయకుని ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు ఇటువంటి అవంతిని సంగతులు జరగకుండా ఎస్ఐ వెలమ ల ప్రసాదపోలీసు బందోబస్తు నిర్వహించారు.

# ఎమ్మెల్యే రేగంకు ఉపాధ్యాయ బృందం సత్కారం





అరకులోయ, సెప్టెంబర్ 15, మేజర్‌న్యూస్:

అరకులోయ నియోజకవర్గం శాసనసభ్యుడు రేగం. మత్స్యలింగంకు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల ఉపాధ్యాయ బృందం ఘనంగా సత్కరించింది. స్థానిక పర్యాటకాభివృద్ధి సంస్థ గోష్టి మందిరంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల గిరిజన ఉపాధ్యాయ సంఘాల ఉమ్మడి తెలుగు రాష్ట్రాల కార్యవర్గ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ ప్రత్యేక కార్యవర్గ సమావేశంలో ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లోని గిరిజన ఉపాధ్యాయులు దీర్ఘకాలికంగా ఎదుర్కొంటున్న సమస్యలు, దశాబ్ద కాలంగా అపరిష్కృతంగా పడి ఉన్న సమస్యల పరిష్కారం, వారి సంక్షేమం కోసం భవిష్యత్తులో చేపట్టాల్సిన పోరుపై కార్యాచరణ ప్రణాళిక రూపకల్పన తదితర అంశాలపై సంఘ ప్రతినిధులు సంఘ సభ్యులతో సుదీర్ఘంగా చర్చించారు.సమస్యల సాధన కోసం ఉమ్మడి తెలుగు రాష్ట్రాల గిరిజన ఉపాధ్యాయ సంఘాలు చేపట్టనున్న శాంతియుత ఆందోళన కార్యక్రమానికి ఉపాధ్యాయులందరూ విధిగా హాజరుకావాలని సమావేశంలో తీర్మానించారు. ఎటువంటి ఒడిదుడుకులకు లోనుకాకుండా, ఎవరి ఒత్తిడి లకు భయాందోళన చెందకుండా సమస్యల పరిష్కారం కోసం ఉద్యమించాల్సిన అవసరం ఉందని ఈ ప్రత్యేక సమావేశంలో సంఘాల ప్రతినిధులు నొక్కి చెప్పారు.అంతకుముందు ప్రత్యేక సమావేశానికి ఎమ్మెల్యేను ఉమ్మడి రాష్ట్రాల ఉపాధ్యాయులు సాదరంగా స్వాగతం పలికి పుష్పగుచ్ఛాలు అందజేసి శాలువా కప్పి సన్మానించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే రేగం. మత్స్యలింగం ఉపాధ్యాయులను ఉద్దేశించి మాట్లాడుతూ గిరిజన ఉపాధ్యాయుల సంక్షేమం కోసం తన వంతు కృషి చేస్తానన్నారు. తమ సహచర ఉపాధ్యాయుడు శాసనసభ్యుడిగా ఎన్నిక కావడం ఆనందంగా ఉందని పలువురు ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు చెప్పారు. ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ గిరిజన ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు పొక్కి.నారాయణ,కెందు, ఎల్.బి.దయానిధి,సుబ్బారావు, తెలగంజి. పద్మావతి,సుజాత,రాజేంద్రకుమార్, తెలంగాణ రాష్ట్రం గిరిజన ఉపాధ్యాయ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# అన్నసమారాధన పాల్గొన్న ఎమ్మెల్యే దంపతులు

లక్కవరపుకోట, సెప్టెంబర్ 15, మేజర్‌న్యూస్:



మండలములోని రంగరాయపురం గ్రామంలో గల సాలివాహన సంగం (కుమ్మరి ) సంగం సభ్యుల అద్వర్యం లో నిర్వహిస్తున్న వినాయక నవరాత్రులలో భాగంగా ఆదివారము జరిగిన పూజ కార్యక్రమంలో ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి రాంప్రసాద్ దంపతులు పాల్గొన్నారు వినాయకునికి ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రసాదం స్వీకరించారు ఈ సందర్భంగా వారు ఏర్పాటు చేసిన అన్న సమారాధన కార్యక్రమాన్ని వారు ప్రారంభించారు భక్తి శ్రద్దలతో ప్రజలు వినాయకునికి పూజలు చేస్తున్నారని అందరిపై వినాయకుని దయ తప్పక ఉంటుందన్నారు ఈ కార్యక్రమం లో మాజీ జడ్పీటీసీ కరెడ్ల ఈశ్వరరావు శాలి వాహన సంగం సభ్యులు పాల్గొన్నారు అలాగే ఇదే గ్రామం లో యాత పేట లో వైస్ ప్రెసిడెంట్ జోఅమ్మల శ్రీను ఇతర పెద్దల ఆధ్వర్యములో నిర్వహిస్తున్న వినాయక నవరాత్రుల్లో భాగంగా శనివారం అన్న సమారాధన ఏర్పాటు చేసి ఆదివారము నిమజ్జన కార్యక్రమం మేళ తాళాలతో నిర్వహించారు ఈ కార్యక్రమాలలో యువత మహిళలో ఉత్సాహంగా పాల్గొని సందడి చేసారు.

# వందే భారత్ లాంటి లగ్జరీ ట్రైన్ కాదు !

## సామాన్యులు ప్రయాణించే పాసింజర్ ట్రైన్లు వేయండి - సిపిఎం





బొబ్బిలి, సెప్టెంబర్ 15, మేజర్‌న్యూస్:

విశాఖపట్నం విజయనగరం పార్వతీపురం వంటి వెనుకబడిన జిల్లాల నుండి రోజు విశాఖపట్నం కు విద్యార్థులు, ఉద్యోగులు, వైద్యం నిమిత్తం వేలాదిమంది ప్రజలు రాకపోకలు చేస్తుంటారు. లోకల్ పాసింజర్ రైలు లేక తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారు. ప్రతి రోజూ వ్రేలాడుతూ కిక్కిరిసి జనరల్ బోగీలో ప్రయాణం చేస్తున్నారు. విశాఖపట్నం నుండి పార్వతీపురం వరకు లోకల్ రైళ్ళు వేయండి అని ప్రజలు నెత్తునూరు కొట్టుకుంటే మోడీ ప్రభుత్వం మన ప్రాంతానికి ఏ మాత్రం ఉపయోగపడని వందే భారత్ రైలు విశాఖపట్నం - దుర్గ్ కు వేశారు. ఈ ట్రైన్ కేవలం వాళ్ల ప్రభుత్వం ఉన్న ఛత్తీఘడ్ రా ష్ట్రానికి తప్ప మనకి ఏమాత్రం ఉపయోగపడదని సిపిఎం పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు పి. శంకర్రావు సిపిఎం పార్టీ బొబ్బిలి మండల కార్యదర్శి సింగిరెడ్డి గోపాలు పట్టణ సిపిఎం పార్టీ నాయకులు బంగారు యుగంధర్ అన్నారు. మన ఆంధ్రప్రదేశ్ కేంద్రంలో మోడీ ప్రభుత్వానికి ఎంత చులకనగా కనిపిస్తుందో దీనిని బట్టి అర్థం అవుతుంది. ఈ లగ్జరీ రైళ్ళు కేవలం వ్యాపారస్తులకు ఉన్నత వర్గాలకు మాత్రమే ఉపయోగపడుతుందని అన్నారు దాని ధరలు సామాన్య ప్రజలు భరించలేరని అన్నారు. విశాఖపట్నం విజయనగరం ఎంపీలు ఈ మూడు జిల్లాల ఎమ్మెల్యేలు ఈ మూడు జిల్లాల ప్రజల మీద మీకు ఏమాత్రం గౌరవం ఉన్న తక్షణమే విశాఖపట్నం నుండి పార్వతీపురం వరకు లోకల్ పాసింజర్లు రైళ్ళు నడిపే విధంగా కేంద్రం పైన ఒత్తిడి తేవాలని కోరారు. ఈ మూడు జిల్లాల మీదుగా వెళ్లే ఎక్స్ప్రెస్ రైళ్ల లో జనరల్ బోగీలు పెంచే విధంగా రైల్వే డిపార్ట్మెంట్ పై ఒత్తిడి తేవాలని కోరారు. మన మూడు జిల్లాల ప్రయాణికుల కష్టాలను తీర్చాలని సిపిఎం పార్టీగా విజ్ఞప్తి చేస్తున్నాం.

# నేత్ర సమస్యలను పరిష్కరించడంలో కోటగిరి దిట్ట

## తిరుపతి లో పలువురు ప్రశంసలు అందుకున్న కంటి వైద్యులు అప్పారావు

బొబ్బిలి, సెప్టెంబర్ 15, మేజర్‌న్యూస్:





బొబ్బిలి పట్టణానికి చెందిన ప్రముఖ కంటి వైద్య నిపుణులు డాక్టర్ కోటగిరి వెంకట అప్పారావు ( రిటైర్డ్ ప్రొఫెసర్ ) తిరుపతి లో గత మూడు రోజులుగా జరుగుతున్న సెమినార్ లో పాల్గొన్నారు. గ్లకోమా కంటి సమస్యలను గుర్తించి, పరిష్కరించడంలో బొబ్బిలి కంటి వైద్యులు కోటగిరి అప్పారావు అందెవేసిన చేయి అని అనేక సార్లు నిరూపించుకున్నారు. ఈ రంగంలో దేశ వ్యాప్తంగా రాణిస్తున్న అత్తికొద్ది మంది నిపుణులలో డాక్టర్ అప్పారావు ముందు వరుసలో నిలుస్తున్నారు. అప్తాలజీ రంగంలో పేరు గాంచిన ప్రముఖులు ఈ మాటను అంటూ ఆయనను కొనియాడుతు ఒడడం గమనార్హం. ఆంధ్రా -ఒడిశా ప్రాంతాలకు చెందిన వేలాది మంది నేత్ర సమస్యలను పరిష్కరించడంలో విశేషమైన సేవలు అందిస్తున్న డాక్టర్ అప్పారావు ను జాతీయ, అంతర్జాతీయ వేదికలపై ( సెమినార్ లలో, ఇతరత్రా ) ప్రముఖ వైద్య నిపుణులు, నిష్ణాతులతో ప్రశంసలు అందుకోవడం చెప్పుకోదగ్గ అంశం.ఈ ఈ చారిత్రాత్మక మైన మన వీర బొబ్బిలి గడ్డకు డాక్టర్ అప్పారావు మరో కలికితురాయి అని చెప్పవచ్చు.

## అడవుల రక్షణ పేరుతో

# పచ్చని ప్రకృతిని విధ్వంసం చేయడం సరికాదు

పాతపట్నం, సెప్టెంబర్ 15, మేజర్‌న్యూస్:



మానవ మునగడ కోసం పచ్చని ప్రకృతి, పర్యావరణము అవసరము ఉన్నందున అడవుల సంరక్షణ కోసం మరియు వృక్ష సంపదను పెంపొందించడం కోసం ప్రభుత్వాలు హరితహారం పేరట పర్యావరణ అభిమానులు మరియు స్వచ్ఛంద సేవా సంస్థలు అనేక విధాలుగా మొక్కలు నాటే కార్యక్రమాలు చేస్తూ ఉంటే ట్రెంచ్ లు తవ్వకం పేరుతో ఈ విధంగా పచ్చని అటవీ సంపదను మరియు పర్యావరణాన్ని విధ్వంసం సృష్టించడం సరికాదు అని ప్రభుత్వ ఆస్తులు,పర్యావరణ పరిరక్షణ కోసం పోరాడుతున్న వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు బి నారాయణమూర్తి ఆవేదన వ్యక్తం చేశారు పాతపట్నం విద్య మరియు జీవనోపాధికి అనువుగా ఉన్నందున దూర ప్రాంతాల నుండి వచ్చి గృహాలు నిర్మించుకొని నివాసము ఉండాలి అని అనుకుంటున్నా వారి సంఖ్య ఎక్కువగా ఉండటం వలన కొంతమంది అక్రమార్కులు పాతపట్నం పరిసర ప్రాంతాలలో ఉన్న ప్రభుత్వ భూములు చెరువులు, గెడ్డలు ప్రజా రహదారులు సైతం ఆక్రమించుకొని అమ్ముకుంటూ ఉన్నారు సర్వే నెంబర్లు మార్చి రిజిస్ట్రేషన్లు చేస్తూ ఉన్నారు పంచాయతీ అధికారులు బాధ్యతారాహిత్యంగా ప్రవర్తిస్తూ అధికార దుర్వినియోగానికి పాల్పడుతూ పర్యావరణాన్ని విధ్వంసం కలిగించే విధముగా భవన నిర్మాణాలకు అనుమతులు మంజూరు చేస్తున్నారు అదే విధముగా పాతపట్నంలో మీ కార్యాలయానికి ఆనుకొని ఉన్న జోగికొండ అనబడు రిజర్వ్ ఫారెస్ట్ ను కూడా ఇదే విధముగా ఆక్రమించుకొని అమ్ముకుంటున్నారు పంచాయతీ అధికారులు భవన నిర్మాణాలకు అనుమతులు మంజూరు చేస్తున్నారు ఈ అడవిని ఇదే విధముగా ఆక్రమించుకొని పర్యావరణాన్ని విధ్వంసం కలిగించే విధముగా భవన నిర్మాణాలు జరిగితే పచ్చని ప్రకృతి మరియు పర్యావర ణం పాడిపోయే ప్రమాదము ఉన్నదని ఆక్రమణలను మరియు అక్రమ నిర్మాణాలను తొలగించి పచ్చని ఈ అటవీ సంపదను కాపాడాలని స్థానిక,జిల్లా అటవీ శాఖ అధికారులకు ఫిర్యాదులు చేయడం జరిగింది జిల్లా అధికారుల ఆదేశాల మేరకు అడవి చుట్టూ ట్రెంచ్ తవ్వడం జరిగింది తవ్విన ఆ ట్రెంచ్ ఆ అడవిని రక్షించే విధంగా కాకుండా అక్రమార్కులకు సహకరించే విధం గా ఉన్నందున ఆ క్రమములతో పాటు ఆక్రమణలతో పాటు ఈ తవ్వకాలపై కూడా దర్యాప్తు జరిపించి అక్రమార్కులకు వారికి సహకరించిన అధికారులపై చర్యలు తీసుకొని ఈ అటవీ సంపదను కాపాడాలని జిల్లా అటవీ శాఖ అధికారులతో పాటు పచ్చని అటవీ సంపద పరి రక్షణే ధ్యేయంగా కృషి చేస్తున్న ప్రిన్సిపాల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ వారికి మరియు రాష్ట్ర ప్రభుత్వ ఉన్నత అధికారులకు కూడా ఫిర్యాదులు చేసినప్పటికీ కూడా పచ్చని అటవీ సంపదను కాపాడవలసిన అధికారులు బాధ్యతారాహిత్యంగా ప్రవర్తిస్తూ అధికార దుర్వినియోగానికి పాల్పడుతూ ఇదివరకే తవ్విన ట్రించను అక్రమార్కులకు సహకరించే విధంగా ఆ అడవి వైభాగానికి మార్చి మరల తవ్వి,హద్దులు సూచించే సిమెంట్ దిమ్మలను కూడా ఆ అడవి పైభాగానికి మార్చడం జరిగింది. ఇ దే అటవీ సంపద రక్షణ కోసం నా ఫిర్యాదుల మేరకు తీసుకున్న చర్యలు గురించి ప్రస్తావిస్తే పచ్చని అటవీ సంపదను,పర్యావరణాన్ని కాపాడాలని కోరిన నా ఫిర్యాదులను కాగితపు ముక్కలతో పోల్చి మాట్లాడడం ఆ అధికారి బాధ్యతారాహిత్యం,అహంకారానికి అహంకారానికి ఒక నిదర్శనముగా భావించవచ్చును అందువలన ఈ వ్యవహారంపై ఉన్నత స్థాయి దర్యాప్తు జరిపించి అక్రమార్కులకు వారికి సహకరించిన అధికారులపై చర్యలు తీసుకొని పచ్చని అటవీ సంపదను,పర్యావరణాన్ని కాపాడాలని ప్రిన్సిపాల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ గారికి మరల ఫిర్యాదు ద్వారా కోరడం జరుగుతుంది అని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు బి నారాయణమూర్తి అన్నారు.

# మూలపేటలో 32 వేలకు పలికిన వినాయక లడ్డు

సంతబొమ్మాళి, సెప్టెంబర్ 15, మేజర్‌న్యూస్:



మండలంలో మూలపేట గ్రామంలో వినాయకులడ్డు వేలంపాటలో 32 వేల రూపాయలకు గ్రామానికి చెందిన జీరు గజేంద్ర ఆదివారం దక్కించుకున్నారు. వినాయక నవరాత్రుల్లో భాగంగా నౌపడలో 2000 మందికి అన్నదాన కార్యక్రమం, దీపారాధన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# పాత జ్ఞాపకాలును గుర్తు చేసుకున్న

## సంస్థానం హైస్కూల్ పూర్వ విద్యార్థులు



బొబ్బిలిరూరల్, సెప్టెంబర్ 15, మేజర్‌న్యూస్:

బొబ్బిలి సమస్థానం హై స్కూల్ 1986-91 బ్యాచ్ పూర్వవిద్యార్థుల కలయిక ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అప్పటి ఉపాధ్యాయులు సమయస్ఫూర్తి, పాఠాలు చెప్పే విధానం, క్రమశిక్షణలపై అందరు తమ స్మృతులను గుర్తు చేసుకుంటూ ఆహ్లాదకారంగా గడిపారు. అనంతరం పూర్వ ఉపాధ్యాయులకు సత్కరించారు. స్థానిక సాయి డిగ్రీ కళాశాల లో జరిగిన ఈ కార్యక్రమంను సల్మాన్ రాజు, జీవ రమణ, రమేష్ తదితరులు నిర్వహణ చేశారు.

# విజయ గణపతి ఆలయంలో లడ్డు వేలం పాట

నరసన్నపేట, సెప్టెంబర్ 15, మేజర్‌న్యూస్:



పోలాకి మండలం తలసముద్రం గ్రామంలో పురాతనమైన విజయ గణపతి ఆలయం ఆవరణలో నిర్వహించిన గణపతి నవరాత్రుల ఉత్సవాల సందర్భంగా జరిగిన లడ్డు వేలం పాటలో గ్రామానికి చెందిన భావన రామారావు 21 వేల రూపాయలుకు సొంతం చేసుకున్నారు. వినాయక చవితి మొదలుకొని నిర్వహించిన నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా ప్రతిరోజు పూజాధి భజన కార్యక్రమాల నిర్వహణతో ఆధ్యాత్మిక శోభతో వినాయక చవితి నవరాత్రి ఉత్సవాల కమిటీ సభ్యులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువకులు ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# వందే భారత్ రైలు హాల్ట్ కోసం ఎమ్మెల్యే కృషి చేయాలి

బొబ్బిలి రూరల్, సెప్టెంబర్ 15, మేజర్‌న్యూస్:



కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన దుర్గ - విశాఖ వందే భారత్ రైలు బొబ్బిలిలో హాల్ట్ కోసం విజయ నగరం ఎంపి, బొబ్బిలి ఎమ్మెల్యే కృషి చేయాలని పలువురు కోరుతున్నారు. చారిత్రాత్మక బొబ్బిలి లో ట్రైన్ ఆగకపోవడం చాలా అన్యాయం రాజాం, సాలూరు, రామభద్రపురం, బలిజిపేట ప్రాంతాలనుండి వచ్చిన ప్రజలకు ఉపయోగపడేటట్లు నాయుకులు ప్రయత్నించాలి. అవసరమైతే ప్రింట్ మీడియా, ఎలక్ట్రానిక్ మీడియాను ఉపయోగించుకొని ప్రభుత్వనికి మన డిమాండ్ తెలియ జేయాలి. ఇప్పటికే పార్వతీపురం లో వందే భారత్ రైలు నిలుపుదల కోసం రైల్వే మంత్రిని కలిసి అరకు ఎంపీ తనూజా, పార్వతీపురం ఎమ్మెల్యే విజయచందర్ కృషి చేసిన విషయాన్ని బ్లాగు సాయికృష్ణ గుర్తు చేశారు.

# పేకాట రాయులు అరెస్టు

## 36500 రూపాయలు స్వాధీనం

సీతంపేట, సెప్టెంబర్ 15, మేజర్‌న్యూస్:

ఎస్ ఐ శివప్రసాద్ నాయుడు ఆధ్వర్యంలో ఆదివారం జరడ కాలనీ సరి హద్దు ప్రాంతంలో తమ సింబందిది కూంబింగ్ నిర్వహిస్తుండ గా ఇద్దరు పేకాట రాయులును అదుపులో తీసుకొని పేకలు సీజ్ చేసి వారి వద్ద 36500 రూపాయలు స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ ఐ శివప్రసాద్ తెలిపారు.

# దాతృత్వం చాటుకున్న ఎస్ఐ ప్రయోగమూర్తి

పాలకొండ, సెప్టెంబర్ 15, మేజర్‌న్యూస్:



పాలకొండ వీరఘట్టం రోడ్డు సమీపంలో బైక్ పై వెళుతుండగా మార్గ మధ్యంలో ఒక గుమ్మలో పడిపోయిన బైక్ యజమా ని దాక్షవరపు శివ గడ్డ కుమ్మర వీధికి చెందిన అపర స్థితిలో పడిపోయిన ఉన్న శివను చూసి అప్పుడే వెళున్న ఎస్సై ప్రయోగమూర్తి గాయాల పాలు అయ్యున్న శివ చూసి పోలీస్ వెహికల్ ఎక్కించుకొని గవర్నమెంట్ ఏరియా హాస్పిటల్ కి తరలించారు ఆ శివ కుటుంబం వ్యక్తులకు శివ పడిపోయి ఉన్న పరిస్థితిని వివరించారు గవర్నమెంట్ ఏరియా హాస్పిటల్ లో ట్రీట్మెంట్ అందించమని డాక్టర్లకు ప్రయోగమూర్తి మరియు సిబ్బంది ట్రీట్మెంట్ అందించారు పోలీస్ వెహికల్ లో శివ ను తెచ్చినందుకు పోలీసులను కుటుంబీకులు అభినందించారు.

# చిన్నతాడిలో అన్నసమారాధన



అనకాపల్లి ప్రతినిధి, సెప్టెంబర్ 15 మేజర్ న్యూస్

అన్ని దానాల్లో కన్నా అన్నదానం మిన్న అంటూ వినాయక నవరాత్రులలో భాగంగా గ్రామంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని మాజీ ఎంపీపీ మాదంశెట్టి నీల బాబు ప్రారంభించారు. జీవీఎంసీ పరిధిలో గల చిన్న తాడి గ్రామంలో ఆదివారం గణేష్ యూత్ ఆధ్వర్యంలో అన్న సమారాధన జరగగా గ్రామంలో పెద్దలు అన్న సమారాధనలో పాల్గొని అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు ఈ కార్యక్రమంలో వార్డ్ కార్పొరేటర్ మాదంశెట్టి చిన్న తల్లి, కూటమి నాయకులు అప్పారావు, సూరిబాబు పలువురు గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయ శాసనమండలి ఏ పి టి ఎఫ్ అభ్యర్థిగా రఘువర్మ

బొబ్బిలి, సెప్టెంబర్ 15, మేజర్‌న్యూస్:





2025 ఫిబ్రవరి ,మార్చ్ నెలలో జరుగనున్నశాసన మండలి ఎన్నికల్లో ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ శాసనమండలి ఏ పి టి ఎఫ్ అభ్యర్థిగా పాకలపాటి రఘువర్మను ఫెడరేషన్ రాష్ట్ర నాయకత్వం ఏకగ్రీవంగా ఆయన అభ్యర్థిత్వాన్ని ఖరారు చేసినట్లురాష్ట్ర అకడమిక్ కన్వీనర్ జె సి రాజు జిల్లా గౌరవాధ్యక్షులు జోగినాయుడు లు తెలియచేసారు. ఆదివారం ఎన్ జి ఓ హోమ్ లో డివిసిన్ లోని మండలాల ముఖ్య నాయకులతో అత్యవసర సమావేశం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా జె సి రాజు మాట్లాడుతూ గత ప్రభుత్వ హాయంలో పాఠశాల విద్యాలో జరిగిన సంక్షోభాలు, సమస్యల నివారణకు ఎపిటీఎఫ్ అభ్యర్థి గెలుపు తప్పని సరని అందుకుగాను ఎపిటీఎఫ్ అభ్యర్థిగా రఘువర్మను ఉత్తరాంధ్ర జిల్లాలు ఏకగ్రీవంగా ప్రతిపాదించాయని తెలియచేసారు.ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ నియోజకవర్గ పరిధిలో వుండే ఉపాధ్యాయులు, అధ్యాపకులు, ఆచార్యులు అందరూ రఘువర్మ అభ్యర్థిత్వాన్ని బలపరుస్తూ రానున్న శాసన మండలి ఎన్నికల్లో గెలిపించాలని వారు కోరారు. ప్రతి ఏ పి టి ఎఫ్ కార్యకర్త రఘువర్మ విజయానికి కృషి చేయాలని వారు పిలుపునిచ్చారు. సమావేశంలో ప్రవీణ్, లక్ష్మణ రావు, శ్రీను, రామ కృష్ణ, మూర్తి,పరసునాయుడు తదితరులు పాల్గొన్నారు.

## వైసిపి సీనియర్ నాయకుడు కుటుంబాన్ని

# పరామర్శించిన డిప్యూటీ సీఎం రాజన్న దొర

పాచిపెంట, సెప్టెంబర్ 15, మేజర్‌న్యూస్:



సాలూరు నియోజకవర్గం పాచిపెంట మండలం పద్మాపురం పంచాయతీ పద్మాపురం గ్రామానికి చెందిన వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బర్ల తులసి ప్రసాద్ కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ విజయనగరం మహారాజా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందడం జరిగింది. ఈ విషయం తెలుసుకున్న మాజీ ఉప ముఖ్యమంత్రి మరియు మాజీ గిరిజన సంక్షేమ శాఖ మంత్రివర్యులు పీడిక రాజన్న దొర ఆదివారం పద్మాపురం వెళ్లి బి టి ప్రసాద్ మృతదే హానికి పూలమాలలు వేసి నివాళులర్పించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. కుటుంబసభ్యులతో మాట్లాడి పార్టీ అండగా ఉంటుందని అధైర్య పడవద్దని ధైర్యాన్ని చెప్పారు.రాజన్నదొరతో పాటు పార్టీ సీనియర్ నాయకులు గొట్టాపు ముత్యాల నాయుడు, పాచిపెంట.వీరంనాయుడు(చినబాబు),డోల బాబ్జి, సలాది.అప్పలనాయుడు, దండి శ్రీనివాసరావు, దండి కొండలరావు, కలవలపల్లి పెద్దిబాబు, తట్టికాయల గౌరీష్, కోరిపల్లి.రవింద్ర తదితరులు నివాళులర్పించారు.

# ఉపాధి హామీ చట్టం ప్రకారం అధికారాలు సర్పంచులదే

## -మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్న దొర



పాచిపెంట, సెప్టెంబర్ 15, మేజర్‌న్యూస్:

ఉపాధి హామీ పథకం చట్టం ప్రకారం అధికారాలన్నీ సర్పంచులకే ఉండాలని మాజీ డిప్యూటీ సీఎం రాజన్న దొర అన్నారు. మండలంలో తాడూరు గ్రామం లో సర్పంచులు, ఎంపీటీసీలు తో ఆదివారం సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన విలేకర్ల తో మాట్లాడుతూ... ఉపాధి హామీ పథకం పనులు చేయాలంటే ముందుగా తీర్మానాలు తీసుకున్న తర్వాత పనులు మంజూరు చేయవలసి ఉంటుందన్నారు.ఉపాధి హామీ పథకం నిబంధనలు ప్రకారం గ్రామ సభల్లో పనులు సమాచారం తీసుకొని పంచాయతీకి ఇస్తారని, ఆ పంచాయితీ తీర్మానం చేసి మండల పరిషత్ కు పంపిస్తారని మండల పరిషత్ లో తీర్మానం చేసి జిల్లా పరిషత్ కు ఆ తీర్మానాన్ని పంపిస్తారు. అక్కడ నుంచి జిల్లా పరిషత్ తీర్మానం చేసి జిల్లా కలెక్టర్ కు పంపిస్తారని అప్పుడు , జిల్లా కలెక్టర్ ఆ పనులకు మంజూరు చేస్తారని తెలిపారు. కూటమి ప్రభుత్వంలో ఆగస్టులో గ్రామసభలు పంచాయతీల వారీగా పెట్టారని. ఆ గ్రామ సభలో పనులు తీర్మానాలు పెడుతున్నట్లు ఏ గ్రామ సభ లో చెప్పలేదని పలువురు సర్పంచులు తమ ముందు వాపోయారన్నారు. అయితే గ్రామసభ తీర్మానాలు లేకుండా సాలూరు నియోజకవర్గం లో పలు పనులు మంజూరు చేశారని తెలిపారు. ఆ పనులు చేయడానికి పంచాయతీ, మండల పరిషత్, జిల్లా పరిషత్ తీర్మానాలు తీసుకురావాలని చెబుతున్నారని తెలిపారు. ఉపాధి హామీ పథకం పనులు లో గతంలో ఈ పద్ధతి లేదని. పంచాయితీ తీర్మానం గ్రామసభలో ఉంటుందని. పంచాయతీ మెంబర్లు. పంచాయతీ సర్పంచ్, ఎంపీటీసీలు, గ్రామ పెద్దలు కలిసి తీర్మానం చేస్తారని, పంచాయతీ తీర్మానం మండల పరిషత్ తీర్మానం, జిల్లా పరిషత్ తీర్మానం తర్వాతే పనులు మంజూరు చేసి పనులు చేస్తారని తెలిపారు. అధికారులకు తెలుగుదేశం పార్టీ నాయకులు ఒత్తిడి ఉందని, తెలుగుదేశం పార్టీ నాయకులు ఎమ్మెల్యేలు ఒత్తిడి మూలంగా సర్పంచులు, ఎంపీపీలు, జిల్లా పరిషత్ చైర్మన్ మీద రుద్దుతున్నారని ఆరోపించారు. సర్పంచులు, ఎంపీటీసీలు, తీర్మానాలు ఇస్తామని, చట్టాన్ని అనుసరించి తీర్మానం ఇస్తామన్నారు. ఆగస్టులో గ్రామ సభలో తీర్మానాలు చెప్పకుండా పనులు తీసుకున్నారని. ఆ పనులతో పాటు మరికొన్ని అవసరమైన పనులు కలిపి తీర్మానం ఇస్తామని, తీర్మానం చేసిన అన్ని పనులు జిల్లా కలెక్టర్ మంజూరు చేయాలని తెలిపారు. ఉపాధి హామీ పథకం పనులు పంచాయితీ, మండల పరిషత్, జిల్లా పరిషత్ అనుమతులు లేకుండా పనులు చేయడం సమంజసం కాదన్నారు. ఉపాధి హామీ పథకం నిబంధనల ప్రకారం ఎగ్జిక్యూటివ్ అధికారాలు సర్పంచ్ కే ఉంటుందని. పనులు సర్పంచులు ద్వారా జరగాలని. సర్పంచ్ బ్యాంకు ఖాతాలోని పనులకు సంబంధించిన నిధులు వేయాలని తెలిపారు. సర్పంచులకే ఎగ్జిక్యూటివ్ అధికారాలు ఇవ్వాలని, ఉపాధి హామీ పథకం నిబంధనలు చెబుతున్నాయని, ఆ విధంగా ఇవ్వాలన్నారు. తెలుగుదేశం పార్టీ నాయకులు ఒత్తిడి లకు పనులు మంజూరు చేశామని తీర్మానాలు తప్పనిసరిగా ఇవ్వాలని ఒత్తిడి చేస్తే ప్రజా పోరాటం చేస్తామని, నిరసనలు తెలియజేస్తామని తెలిపారు. ప్రజా పోరాటానికి, నిరసనలు చేసిన స్పందించకపోతే న్యాయపోరాటం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు, ఎంపీటీసీలు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

# పర్యాటక అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

## జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం, సెప్టెంబర్ 15, మేజర్‌న్యూస్:



సెప్టెంబర్ 27 ప్రపంచ పర్యాటక దినోత్సవం పురస్కరించుకొని 2023-24కు గాను ప్రకటించిన వివిధ అవార్డులకు అర్హులైన పర్యాటక సంబంధిత రంగాల నుండి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి ఏటా మాదిరిగానే మొత్తం 38 విభాగాల నుండి 41 అవార్డుల కోసం దరఖాస్తులు చేసుకోవచ్చని చెప్పారు. దరఖాస్తులను ఏపీ టూరిజం వెబ్సైట్ www.aptourism. gov.in నుంచి డౌన్లోడ్ చేసుకోవాలని, పూర్తి చేసిన వాటిని ఆంధ్రప్రదేశ్ టూరిజం అథారిటీ, 5వ ఫ్లోర్, స్టాలిన్ కార్పొరేట్ బిల్డింగ్,ఆటోనగర్, విజయవాడలో ఈనెల 22వ తేదీ లోపు అందజేయాలని కోరారు. దరఖాస్తులు చేయాల్సిన విభాగాలు: ఉత్తమ హోటల్ (5 స్టార్, 4 స్టార్, 3 స్టార్), ఉత్తమ బడ్జెట్ హోటల్, బెస్ట్ వే సైడ్ ఎమినిటీస్, ఉత్తమ హరిత హోటల్, ఉత్తమ పర్యావరణ అనుకూల హోటల్, ఉత్తమ థీమ్ ఆధారిత రిసార్ట్, హోటల్‌లోని ఉత్తమ రెస్టారెంట్, ఉత్తమ థీమ్ రెస్టారెంట్, ఉత్తమ స్టాండ్-అలోన్ రెస్టారెంట్, ఉత్తమ చెఫ్, ఉత్తమ చెఫ్ (ఆంధ్రా వంటకాలు), ఉత్తమ స్టాండ్-ఒంటరి కన్వెన్షన్ సెంటర్,బెస్ట్ యూనిక్ టూరిజం ప్రాజెక్ట్, టూరిస్ట్ డెస్టినేషన్ యొక్క ఉత్తమ పౌర నిర్వహణ (పట్టణ ప్రాంతాలు, గ్రామీణ ప్రాంతాలు), ఆంధ్రప్రదేశ్‌లో పర్యాటకాన్ని ప్రోత్సహించే ఉత్తమ జిల్లా (కలెక్టర్), ఆంధ్ర ప్రదేశ్ అత్యుత్తమ బీచ్, ఉత్తమ టూరిస్ట్ ఫ్రెండ్లీ రైల్వే స్టేషన్,సినిమా షూటింగ్‌కి ఉత్తమ స్థానం, ఉత్తమ పర్యాటక అనుకూల విమానాశ్రయం, బెస్ట్ టూరిస్ట్ ఫ్రెండ్లీ బస్ స్టాండ్, స్థానిక పర్యాటక ప్రాజెక్టులు: టూరిజం ప్రాజెక్ట్ యొక్క ఉత్తమ సమగ్ర అభివృద్ధి, ఉత్తమ డొమెస్టిక్ టూర్ ఆపరేటర్, ఉత్తమ ట్రావెల్ ఏజెంట్, ఉత్తమ ట్రావెల్ ఏజెంట్ (బోటింగ్), ల్యాండ్, ఏరో %డ% వాటర్ స్పోర్ట్స్ కోసం బెస్ట్ అడ్వెంచర్ ఇన్‌బౌండ్ టూర్ ఆపరేటర్ (డొమెస్టిక్), అత్యంత వినూత్నమైన ఇన్‌బౌండ్ టూర్ ఆపరేటర్ (దేశీయ), టూరిజాన్ని ప్రమోట్ చేస్తున్న బెస్ట్ ఎమర్జింగ్ ట్రావెల్ కంపెనీ, ఉత్తమ పర్యాటక విద్యా సంస్థ, రచన/ప్రచురణలో శ్రేష్ఠత, ఉత్తమ టూరిస్ట్ గైడ్, ఏపీ టూరిజంపై ఉత్తమ చిత్రం, ఉత్తమ పర్యాటక ప్రమోషన్ కొలేటరల్ పబ్లిసిటీ మెటీరియల్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ యొక్క అత్యంత వినూత్న వినియోగం/ఉత్తమ టూరిజం వెబ్‌సైట్ / పోర్టల్ ప్రమోటింగ్, ఆంధ్రప్రదేశ్ కళ సంస్కృతి ద్వారా పర్యాటక ప్రచారం, ఏపీ టూరిజాన్ని ప్రోత్సహించే ఉత్తమ బ్లాగర్/సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్.